

వెలుగుల సంగమం

నెల్లూరు- ముంబయి జాతీయ రహదారిలో సంగం గ్రామంలో నాలుగు కూడళ్లు ఉన్నాయి. ఇది కొండ కూడలి ప్రాంతం. రాత్రి వేళ విద్యుత్తు దీపాలు, రహదారులపై రాకపోకలు సాగించే వాహనాల దీప కాంతుల మధ్య శోభాయమానంగా కనిపిస్తోంది. సంగం బ్యారేజీ చూసేందుకు వచ్చే యాత్రికుల రాత్రివేళ ఇక్కడ సంగమం ప్రాంతాన్ని చూసి పరవశించిపోతున్నారు. -న్యూస్‌టుడే, సంగం

మస్టర్‌లో మాయాజాలం

- పనులకు హాజరు కాకుండానే జీతాలు
- ఆరోగ్యాధికారి తనిఖీలో వెలుగులోకి..

51వ డివిజన్‌లో హాజరును తనిఖీ చేస్తున్న ఆరోగ్యాధికారి డాక్టర్ దినేష్

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

నగరంలో 21 శానిటరీ డివిజన్లు ఉండగా.. పారిశుద్ధ్య నిర్వహణకు 877 మంది ఆప్కాస్, 344 మంది శాశ్వత, 200 మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. శాశ్వత కార్మికులు నెలకు రూ.70వేలు నుంచి రూ.లక్ష వరకు జీతం తీసుకుంటూ పనులు చేయకుండా వారికి బదులుగా రూ.8వేలు జీతం ఇస్తూ వృద్ధుల చేత చేయిస్తున్నారు. 54 డివిజన్లలో దాదాపు 300 మందికిపైగా కార్మికులు విధులకు హాజరు కావడం లేదని తెలుస్తోంది.

- నెల్లూరు నగరపాలకసంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ దినేష్ 51వ డివిజన్‌లోని మస్టర్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేయగా.. 21 మంది సిబ్బంది ఉన్నారు. 10 మందే పని చేస్తున్నారు. మిగిలిన 11 మంది అటెండెన్సులో ఉన్న వారు కాకుండా విశ్రాంత కార్మికులు, మైనర్లు ఉన్నారు. వీరంతా ఎవరని సచివాలయ సెక్రటరీలను ప్రశ్నించగా.. అయిదేళ్ల నుంచి వీరే పని చేస్తున్నారని సమాధానమిచ్చారు.
- ఓ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పేపర్ ప్లేట్లు తయారీ పరిశ్రమను నడుపుతున్నాడు. అందులో పారిశుద్ధ్య కార్మికులను తీసుకెళ్లి పనులు చేయిస్తున్నారు. దీంతో ఆ డివిజన్‌లో పారిశుద్ధ్యం పడకేసింది. వారికి కార్పొరేషన్ నుంచి జీతం చెల్లిస్తుండడం గమనార్హం.

ఒక్కొక్కరి నుంచి రూ.10వేలు వసూలు

పారిశుద్ధ్య విభాగం కార్మికులు కొందరు పనులు చేయకుండా జీతాలు తీసుకుంటున్నారు. ఇలాంటి వారు దాదాపు 300 మందికిపైగానే ఉన్నారు. కార్మికులంతా వచ్చి పనులు చేస్తున్నట్లు ప్రజారోగ్య విభాగానికి హాజరు పంపిస్తున్నారు. దీని కోసం ఒక్కో కార్మికుడి నుంచి నెలకు రూ.10 వేల వంతున కొందరు కిందస్థాయి అధికారులు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

నోటీసులు జారీ చేస్తాం..

నగరంలోని ప్రతి మస్టర్‌ను తనిఖీ చేస్తా. 51వ డివిజన్‌లో హాజరు రిజిస్టర్‌లో ఉన్న 11 మంది కార్మికులు విధుల్లో లేనిది వాస్తవమే. కార్మికులంతా విధుల్లో ఉన్నట్లు ప్రతిరోజూ శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెక్రటరీకి అటెండెన్స్ పంపిస్తున్నారు. వారికి నోటీసులు జారీ చేయనున్నాం. – డాక్టర్ దినేష్, ఆరోగ్యాధికారి

రికార్డు స్థాయిలో నిమ్మ ధరలు

క్వింటా బస్తా రూ.15,500

పొదలకూరు, న్యూస్‌టుడే: రెండు రోజులుగా నిమ్మకాయలకు రికార్డు స్థాయి ధర పలికింది. సోమవారం పొదలకూరు నిమ్మ మార్కెట్లో క్వింటా బస్తా రూ.15,500కు చేరుకుంది. ప్రస్తుతం నిమ్మ పంట అన్‌సీజన్ కావడంతో కాయల దిగుబడి పెద్దగా ఉండదు. ఫలితంగా వేసవి తలపిస్తున్న ఎండలతో డిమాండు ఏర్పడింది. వారం రోజుల కిందటి వరకు క్వింటా రూ.10వేల నుంచి రూ.12వేలు పలకగా.. ఒక్కసారిగా బస్తాపై రూ.3,500 పెరగడంతో రైతులు పిందెలను సైతం కోసి మార్కెట్టుకు తరలిస్తున్నారు. సీజన్లో 20 లారీలు వచ్చే సరకు ప్రస్తుతం సగం లారీకి కూడా రావడం లేదని చెబుతున్నారు.

తీరప్రాంత భద్రత మరింత పటిష్ఠం

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో తీర ప్రాంత భద్రతను మరింత పటిష్ఠం చేసి అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఛాంబరులో జిల్లా స్థాయి తీరప్రాంత భద్రతా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతంలో నిరంతరం నిఘా ఉంచాలని, క్రమం తప్పకుండా గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల నుంచి పడవలు అక్రమంగా జిల్లాలోకి ప్రవేశించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

వేడుక.. వెలిగొండంతై..

ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి పోటెత్తిన జనం

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల బృందం

దశాబ్దాల కలగా ఉన్న వెలిగొండ ప్రాజెక్టు కళ్ల ముందు సాకారం కావడంతో పశ్చిమ ప్రకాశం ప్రాంత వాసుల ఆనందానికి అవధుల్లేవు. సోమవారం పెదడోర్నాల మండలం గంటావానిపల్లె వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమానికి గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. సీఎం వెళ్లే వరకు కూడా ఉండి వీక్షించారు. కృష్ణా జలాలు తమ ప్రాంతంలో పరవళ్లు తొక్కడం చూసి పరవశించిపోయారు. సీఎం చంద్రబాబు జలహారతి ఇచ్చిన తరువాత భావోద్వేగానికి లోనై కృష్ణమ్మ తల్లికి సాష్టాంగ నమస్కారం చేశారు.

సందర్శకుల సందడి

వెలిగొండ ప్రాజెక్టు చూద్దామనే భావనతో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చారు. గ్రామాలకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినా సరిపోక వాటి పైభాగాన ఎక్కి ప్రయాణించాల్సి వచ్చింది. గంటావానిపల్లె శివారున ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో ఎటువైపు చూసినా జనం కనిపించారు. ఫీడర్ కాలువ మొత్తం సందర్శకులతో నిండిపోయింది.

మాట నిలబెట్టుకున్నా..

సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో వెలిగొండ ప్రాజెక్టుతో ఈ ప్రాంతం ఎలా మార్పు చెందుతుందనేది ప్రస్తావించారు. వెలిగొండ రెండో దశ పూర్తయితే, కృష్ణా తీరానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే మార్కాపురంలోనే పుష్కరాలు జరుపుకోవచ్చని చెప్పారు.

కృష్ణా జలాలకు సారె సమర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

కృష్ణా జలాలను చూసేందుకు భారీగా తరలి వస్తున్న ప్రజలు

చెప్పలేనంత ఆనందం

వెలిగొండ జలాల విడుదల సందర్భంగా ఎంతో భావోద్వేగంగా ఉంది. దాదాపు 30 ఏళ్లకు మాకు నీళ్లు రాబోతున్నాయి. ఆ భగవంతుడు సీఎం చంద్రబాబుకు 30 ఏళ్లుగా అధికారాన్ని, ఆర్థిక శక్తిని కల్పించి ఉదయగిరి ప్రాంతాలకు నీళ్లు వచ్చేలా చేశాడు. కృష్ణాజలాలను చూస్తుంటే మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది. ఈ ప్రాంతంలో 62 వేల ఎకరాలకు నీళ్లు రాబోతున్నాయి. మా పరిధిలోని ఎనిమిది మండలాలు ఉంటే, మాకు నాలుగు మండలాలకు వెలిగొండ జలాలు వస్తాయి.

– కాకర్ల సురేష్, ఎమ్మెల్యే ఉదయగిరి

పూర్తయి మూడేళ్లు.. ప్రారంభానికి ఎన్నేళ్లో?

వృథాగా మొగళ్లపాలెం మల్టీపర్పస్ ఇండోర్ మైదానం

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో నిర్మించిన మొగళ్లపాలెం బహుళజాతి ఇండోర్ మైదానం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఏళ్లుగా మైదానం కోసం జిల్లా క్రీడాకారులు ఎదురు చూస్తున్నారు. ఆరు నెలల క్రితం మైదానాన్ని ఖేలో ఇండియా పథకం కింద తీసుకునేందుకు పరిశీలకులు వచ్చారు. మైదానంలో వసతులు వివరాలు తెలుసుకున్నారు. నేటికీ ఎలాంటి ఆదేశాలు రాలేదు.

-న్యూస్‌టుడే, నెల్లూరు(బీవీ నగర్)

అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మల్టీపర్పస్ ఇండోర్ మైదానాన్ని నిర్మించాలని గతంలో ప్రతిపాదనలు ఉండగా ఎవరూ పట్టించుకోలేదు. నాడు కేంద్ర మంత్రిగా ఉన్న వెంకయ్యనాయుడు దస్త్రాన్ని కదిలించి మొగళ్లపాలెంలో మంజూరు చేయించారు. గత ప్రభుత్వంలో నిర్మాణం పూర్తయినా.. పాలకులు పట్టించుకోలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మైదానాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది. కానీ నేటికీ పట్టించుకోలేదు. దీన్ని ప్రారంభిస్తే బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, వాలీబాల్ క్రీడలకు ఎంతో ఉపయోగం.

ఖేలో ఇండియా పథకంలో ప్రారంభించాలని..

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కాకుండా కేంద్ర ప్రభుత్వ పథకం ఖేలో ఇండియా కింద మైదానాన్ని ప్రారంభించేందుకు పచ్చజెండా ఊపారు. పథకం కింద ఏటా భారీగా నిధులు రానుండటంతో మొగళ్లపాలెం మైదానం మరింత అభివృద్ధి చెందుతుందని భావించారు. నెలలు గడుస్తున్నా.. ఆ ఊసే లేదు.

ఎదురుచూస్తున్నాం

మొగళ్లపాలెం మైదానం ప్రారంభానికి సంబంధించి ఎలాంటి ఆదేశాలు రాలేదు. వాటికోసం ఎదురుచూస్తున్నాం. త్వరలో ఆదేశాలు వస్తాయని నమ్మకం ఉంది.

– ఎం.పాండురంగారావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

మైదానం విస్తీర్ణం: 150 ఎకరాలు | పనులు ప్రారంభం: 2018లో | పూర్తయింది: 2023లో | నిధులు: రూ.8 కోట్లు

సోమశిలలో 18.943 టీఎంసీల నీరు

అనంతసాగరం: సోమశిల జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, సోమవారం నాటికి 18.943 టీఎంసీల నిల్వ ఉంది. ప్రస్తుతం జలాశయంలో 288.379 అడుగుల మేర నీటి మట్టం నమోదైంది. పవర్ టన్నెల్ ద్వారా 1,450, -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 50, 12వ క్రస్ట్ గేట్ల ద్వారా 1,000 క్యూసెక్కులు డెల్టాకు విడుదల అవుతున్నాయి.

రంగుల వంట.. ఆరోగ్యానికి తంటా

ఈనాడు, నెల్లూరు

జిల్లాలోని పలు హోటళ్ల నిర్వాహకులు వినియోగదారుల్ని ఆకర్షించేందుకు ఆహార పదార్థాల్లో రంగులు కలుపుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పలుచోట్ల అపరిశుభ్ర వాతావరణంలో వంటలు చేస్తూ నిల్వ ఉంచిన మాంసాన్ని వండుతున్నారు. అధికారులు మొక్కుబడి జరిమానాలతో సరిపెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బుచ్చిలో అధికారుల తనిఖీ

ఈ ఏడాది జనవరి నుంచి..
సేకరించిన శాంపిల్స్: 226
కేసుల నమోదు : 31

గడువు ముగిసినా..

గడువు తేదీ ముగిసిన ఆహార ఉత్పత్తులను నెల్లూరు నగరంలోని కొన్ని సూపర్ మార్కెట్లు, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలు అమ్ముతున్నట్లు గుర్తించారు. చికెన్, బిర్యానీ వంటల్లో ప్రమాదకర టేస్టింగ్

ఏమేమి గుర్తిస్తున్నారంటే..

జిల్లాలో సుమారు 25వేలకు పైగా హోటళ్లు, మెస్‌లు, టిఫిన్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో 70శాతానికి పైగా వంట గదుల్లో పరిశుభ్రత ఉండటం లేదు. తాజాగా బుచ్చిరెడ్డిపాలెంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు హోటళ్లు, రెస్టారెంట్లు, జ్యూస్ షాపులు, టీస్టాళ్లలో తనిఖీలు చేయగా.. నిబంధనల ఉల్లంఘనలు కనిపించాయి. కొన్ని హోటళ్లలో వంట గదులు దారుణంగా ఉండడంతో జరిమానా వేశారు. డ్రైఫ్రూట్స్ దుకాణదారులు నిబంధనలకు విరుద్ధంగా రంగులేసి అమ్ముతున్నారు. కివీ డ్రైఫ్రూట్‌కు రంగు కలపకూడదు. ఆకర్షణ కోసం పచ్చరంగు వేస్తున్నారు. నగరంలోని పలు దుకాణాల్లో అధికారులు గుర్తించి నోటీసులు ఇచ్చారు.

హోటళ్లలో అన్నీ ఉల్లంఘనలే

సాల్ట్, రంగులు వాడుతున్నట్లు తనిఖీల్లో వెలుగుచూసింది. హోటళ్లు, కర్రీ పాయింట్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో నూనె పదేపదే వినియోగిస్తున్నారు. బాదంపౌడర్ ప్రమాణాలకు విరుద్ధంగా కల్తీ చేస్తున్నారు. వంటగదుల్లో శుభ్రత లేక ఆహారంలో బొద్దింకలు, పురుగులు, ఎలుకలు పరుగులు పెడుతున్న ఆనవాళ్లను ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు.

కేసుల నమోదు.. జరిమానా

'ఏడు చోట్ల క్రిమినల్ కేసులు నమోదు చేశాం. ప్రమాణాలకు విరుద్ధంగా హోటళ్లు నడిపేవారిపై చర్యలు తీసుకోవడంలో రాజీ పడం' అని జిల్లా ఫుడ్‌సేఫ్టీ కంట్రోలర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

మొక్కుబడి వేదిక

పీజీఆర్ఎస్‌కు స్పందన కరవు

ప్రజా సమస్యలను మండలస్థాయిలోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం తహసీల్దారు కార్యాలయాల్లో ప్రతి సోమవారం పీజీఆర్ఎస్(ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. మండలస్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా కార్యక్రమ లక్ష్యం నీరుగారిపోతోంది. వివిధ శాఖల అధికారులు మొక్కుబడిగా హాజరవుతున్నారు. ఆశించిన స్థాయిలో ఫలితం ఉండడం లేదనే ఉద్దేశంతో అర్జీదారులు అరకొరగా వస్తున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలను 'న్యూస్‌టుడే' పరిశీలించగా.. మొక్కుబడిగా జరిగినట్లు తేలింది. - న్యూస్‌టుడే, నెల్లూరు(గ్రామీణం), దుత్తలూరు, సంగం, చిల్లకూరు, అల్లూరు

పరిశీలన

రెవెన్యూ అధికారులే..

దుత్తలూరులో జరిగిన వేదికకు తహసీల్దారు, శిక్షణ డిప్యూటీ తహసీల్దారుతోపాటు గృహనిర్మాణశాఖ సిబ్బందే హాజరయ్యారు. మధ్యాహ్నం వరకు ప్రజలకు అందుబాటులో ఉండి వారి నుంచి అర్జీలు స్వీకరించాలి. ప్రతి వారం రెవెన్యూశాఖ తప్ప మిగిలిన ఏశాఖ అధికారులు హాజరు కావడం లేదు. గృహనిర్మాణ, వెలుగుశాఖ అధికారులు సిబ్బందిని పంపి మిన్నకుండిపోతున్నారు.

ఏడు అర్జీలే

నెల్లూరు నగరం గ్రామీణ మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తహసీల్దారుతో పాటు వ్యవసాయ, వెలుగు, హౌసింగ్ తదితర మరో ఆరు శాఖల మండల స్థాయి అధికారులే హాజరయ్యారు. ఏడు అర్జీలే వచ్చాయి. 13 శాఖల మండల అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలి.

విధుల్లో ఒక్కరే

సంగంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఉప తహసీల్దారు ఒక్కరే హాజరయ్యారు. తహసీల్దార్, ఎంపీడీవో సర్ కార్యక్రమానికి వెళ్లగా.. ఉప తహసీల్దారు జ్యోతి పాల్గొన్నారు. మిగిలిన శాఖల అధికారులు ముఖం చాటేశారు.

వినతులు రాలేదు

అల్లూరు తహసీల్దారు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి స్పందన లేదు. ఒక్క అర్జీ రాలేదని అధికారులు తెలిపారు. తహసీల్దారు, ఎంపీడీవో, నగర పంచాయతీ కమిషనర్ హాజరయ్యారు.

హాజరైంది ముగ్గురే

చిల్లకూరులోనిరెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌గోపీనాథ్‌రెడ్డి, ఎంఈవో-2మహ్మద్ రవూఫ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక మినహా మిగిలిన శాఖలకుచెందిన అధికారులెవరూ హాజరు కాలేదు.

ఓటుహక్కుకు కొత్తగా 19,299 దరఖాస్తులు

ఈనాడు, నెల్లూరు: ఓటుహక్కు కోసం జిల్లాలో కొత్తగా 19,299 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ముసాయిదా జాబితా విడుదల కాకముందు 6,649 మంది, విడుదలైన తర్వాత 12,849 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. 147 దరఖాస్తుల్ని ఆమోదించారు. 52 తిరస్కరించారు. 12650 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్ఆర్ఐలు 84 మంది కొత్త ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొత్త ఓటు హక్కు కోసం నెల్లూరు రూరల్‌లో అత్యధికంగా 1258 మంది.. గూడూరులో అత్యల్పంగా 470 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. సెప్టెంబరు 28లోగా విచారణ పూర్తిచేసి అర్హుల పేర్లు అక్టోబరు 3న విడుదల చేసే తుది జాబితాలో చేరుస్తారు. సర్ ప్రక్రియలో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువు ఆదివారం అర్ధరాత్రితో ముగిసింది.

అనర్హుల పేర్లు తొలగించాలంటూ..

ఓటర్ల జాబితాలోని అనర్హుల పేర్ల తొలగింపునకు జిల్లాలో 435 దరఖాస్తులు వచ్చాయి. మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిపోయినవారు, ఆయా చిరునామాల్లో లేనివారు, డబుల్ ఎంట్రీలకు సంబంధించిన వారి పేర్లు జాబితా నుంచి తొలగించాలని ఎక్కువగా దరఖాస్తులొచ్చాయి. వీటిలో ముసాయిదాకు ముందు 168 వచ్చాయి. తర్వాత 267 వచ్చాయి. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన అనంతరం ఓట్లు తొలగిస్తారు.

❖ నియోజకవర్గంలో ఒక చిరునామా నుంచి మరో చిరునామాకు, వేరే నియోజకవర్గానికి ఓటు మార్చుకునేందుకు, పేర్లలో తప్పులుంటే వాటిని సరిదిద్దేందుకు మొత్తం 11,048 దరఖాస్తులు రాగా.. సర్ ముసాయిదాకు ముందు 3,589 ఆ తర్వాత అత్యధికంగా 7,459 వచ్చాయి. గ్రామాల్లోని వారు ఎక్కువమంది నెల్లూరు సిటీకి తమ ఓటును మార్చుకుంటున్నారు.

రైతేరాజు
సేంద్రియ సాగు.. లాభాలు బాగు
చిలగడ దుంప.. సిరులు పండగ
6లో

కొలువుల బాట

బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

న్యూస్‌టుడే, నెల్లూరు(సంక్షేమం)

ప్రభుత్వ కొలువులే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు స్టడీ సర్కిళ్లు అండగా నిలుస్తున్నాయి. నిపుణుల బోధన, స్టడీ మెటీరియల్ అందిస్తూ ఉద్యోగ సాధనకు బాటలు వేస్తున్నాయి. శిక్షణ కేంద్రాలకు వెళ్లలేని పేద, మధ్య తరగతి అభ్యర్థులకు ఇవి ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం నగరంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-2 పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులకు శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. 75మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 45 మంది హాజరవుతున్నారు. వీరికి సబ్జెక్టుల వారీగా అయిదుగురు ట్యూటర్లు బోధిస్తున్నారు. స్టడీ మెటీరియల్‌తో పాటు అభ్యర్థులకు స్టైఫండ్‌ను సైతం అందజేస్తున్నారు. రెండు నెలలపాటు తరగతులు జరగనున్నాయి.

శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

2013లో ప్రారంభించి..

బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2013లో స్టడీ సర్కిల్ ఏర్పాటైంది. గ్రూప్-2, డీఎస్సీ, పోలీస్, రైల్వే, ఫారెస్ట్, బ్యాంకు తదితర ఉద్యోగాలకు సంబంధించి పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వ నోటిఫికేషన్ వచ్చినప్పుడు ఆయా ఉద్యోగాలకు సంబంధించి ఒక్కో బ్యాచ్‌లో వంద మందికి శిక్షణ ఇస్తుంటారు. ఇప్పటివరకు 900 మందికి శిక్షణ ఇవ్వగా వీరిలో 110 మంది వివిధ పోటీ పరీక్షల్లో అర్హత సాధించారు.

తరగతులతో ఎంతో ప్రయోజనం



ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు శిక్షణ ఎంతో ఉపయోగపడుతోంది. బోధకులు ఇస్తున్న శిక్షణతో అవగాహన పెంపొందుతోంది. పోటీ పరీక్షలకు ప్రతి అంశాన్ని చక్కగా వివరిస్తున్నారు. డిగ్రీ చదివిన నేను సబ్ రిజిస్ట్రార్ కావాలన్నదే లక్ష్యం.

– తఫ్సీమ్, రామకోటయ్య నగర్, నెల్లూరు

ఆర్థికభారం లేకుండా..

పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందిస్తున్న శిక్షణతో ఆర్థిక భారం తగ్గుతోంది. ప్రైవేటు కోచింగ్ సెంటర్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చక్కగా బోధిస్తున్నారు. పోటీ పరీక్షల్లో అర్హత సాధించేందుకు ఉపయోగపడుతోంది.

– శ్రీనివాస్, రామ్‌నగర్

(c) eenadu

వంతెన.. యాతన

గ్రామీణులు రాకపోకలు సాగించే మార్గాల్లో వంతెనలు శిథిలమయ్యాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన కాలం తీరాయి. ఇవి ఏక్షణమైనా కూలిపోయేలా ఉన్నాయి. వీటి స్థానంలో కొత్తవి కట్టడంలో పాలకులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గత్యంతరం లేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రజలు వాటి పైగా వెళుతున్నారు. జిల్లాలో ప్రమాదకరంగా ఉన్న వంతెనలపై 'న్యూస్‌టుడే' బృంద కథనం.

-న్యూస్‌టుడే, వరికుంటపాడు, విడవలూరు, కోట, గూడూరుపట్టణం, దగదర్తి

గూడూరులో ప్రమాదకరంగా

శిథిలమైన వారధితో భయం.. భయం

దెబ్బతిన్న రక్షణగోడలు

నిత్యం గండమే!

వరికుంటపాడు మండలంలోని అండ్రావారిపల్లె- తూర్పుబోయమడుగుల గ్రామాల మధ్య మలుపుపై ఉన్న బ్రిడ్జి కూలేందుకు సిద్ధంగా ఉంది. గతంలో రాకపోకలు తక్కువగా ఉండటంతో ఇబ్బందులు లేవు. ప్రస్తుతం వరికుంటపాడు- జి.కొత్తపల్లె వరకు నూతనంగా తారు రోడ్డు వేయడంతో నిత్యం రాకపోకలు సాగుతున్నాయి. 10 గ్రామాల ప్రజలకు అనువుగా ఉంది. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు కాలువలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు.

గూడూరు పట్టణంలోని దూద కాలువ వద్ద ఎప్పుడో నిర్మించిన వంతెన కావడంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ఆర్టీసీ డిపో నుంచి బస్సులు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాలన్నా, పట్టణంలో నుంచి వాహనదారులు జాతీయ రహదారికి చేరుకోవాలన్నా దీనిమీదుగా వెళ్లాల్సిందే. శిథిలమవడంతో ఎప్పుడు కూలిపోతుందోనని వారు భయపడుతున్నారు.

తరచూ ప్రమాదాలు

దగదర్తి మండలంలోని వెలుపోడు కు వెళ్లే ప్రధాన రహదారిలో డీఎం కాలువపై నిర్మించిన వంతెన శిథిలమైంది. దశాబ్దాల క్రితం నిర్మించారు. గోడలు దెబ్బతిన్నాయి. వెలుపోడు, మబ్బువారిపాలెం, కామినేనిపాలెం, కాట్రాయపాడు, మనుబోలుపాడు, దుండిగం, బోడగుడిపాడు గ్రామాల వారు దీనిపైగా వెళుతుంటారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహన చోదకులు మృత్యువాత పడుతున్నారు.

రక్షణ గోడ లేక..

ప్రతిపాదనల్లోనే మరమ్మతులు

కోట మండలంలోని గూడలి సమీపంలోని స్వర్ణముఖి నదిపై నాలుగు దశాబ్దాల కిందట నిర్మించిన లోలెవల్ వంతెన అధ్వానంగా ఉంది. పిల్లర్లు పగుళ్లిచ్చాయి. ఇరువైపులా రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. దీని మీదుగా కోట, వాకాడు, నాయుడుపేట మండలాలకు చెందిన 40 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పదేళ్లుగా మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతున్నా ఫలితం లేదు.

స్వర్ణముఖిపై గూడలి సమీపంలో భయానకంగా..

కూలితే.. ఆరు గ్రామాలకు రాకపోకలు బంద్

విడవలూరు మండలంలోని ముదివర్తిలో మలిదేవి వాగుపై నిర్మించిన వంతెన రక్షణ గోడలు కూలిపోయాయి. ఎప్పుడైనా కూలే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపైగా ఊటుకూరు, ముదివర్తి, కంచరపాలెం, ఇనమడుగు, లేగుంటపాడు, పల్లిపాలెం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇది కూలితే ఆయా గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లడం కష్టమే.

ముదివర్తిలో మలిదేవి వాగుపై కూలే స్థితిలో..

సేంద్రియ సాగు.. లాభాలు బాగు

న్యూస్‌టుడే, వరికుంటపాడు

సేంద్రియ పద్ధతిలో.. రసాయన ఎరువుల వినియోగానికి స్వస్తి పలికి తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి సాధిస్తున్నారు. అధిక లాభాలు గడిస్తున్నారు మండలంలోని నార్త్‌కొండాయపాలెనికి చెందిన యువ రైతు మజ్జి నరసింహులు. ఎకరా పొలంలో బత్తాయి.. మరో ఎకరాలో బంతి తోట వేశారు. అంతర పంటగా ఆకు కూరలు, కూరగాయలు పండిస్తున్నారు. భూమిని సారవంతం చేయడానికి పచ్చిరొట్ట విత్తనాలు వేసి మొక్కలుగా ఎదిగాక కలియదున్నుతున్నారు. బత్తాయిలో అంతర పంటగా వేసి మూడు నెలల పాటు పెంచి కలియదున్నడంతో భూమి సారవంతమవుతోంది. ఇలా ఏడాదికి బత్తాయిపై పెట్టుబడి పోను రూ.2 లక్షలు, కూరగాయలు, బంతి తోటపై రూ. 2 లక్షల ఆదాయం సమకూరుతోంది. సేంద్రియ సాగుపై పరిసర గ్రామాల రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన రైతులకు అందిస్తున్నారు.

సొంతంగా జీవామృతం

తయారీ: 200 లీటర్ల నీటిలో రెండు కేజీల బెల్లం, రెండు కేజీల సెనగపిండి, 10 కేజీల ఆవు పేడ, 10 లీటర్ల ఆవు మూత్రం, గుప్పెడు పుట్ట మట్టితో జీవామృతం తయారు చేస్తున్నారు. ఒక ఆవును మేపితే 30 ఎకరాల పంటను సాగు చేయవచ్చు. 200 లీటర్ల నీటిలో 10 లీటర్ల జీవామృతంతో 10 లీటర్ల నిమ్మ, 10 లీటర్ల పిప్పింటాకు కషాయం, 5 లీటర్ల పుల్లటి మజ్జిగ కలిపి పంటలపై పిచికారీ చేస్తే తెగుళ్లు దరిచేరవు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేసి ఖర్చులు తగ్గించుకొని నాణ్యమైన దిగుబడులు సాధించాలని నరసింహులు సూచిస్తున్నారు.

నరసింహులు

బంతి పూల తోట

చిలగడ దుంప తీగ తోట.. (అంతర చిత్రంలో) లక్ష్మిరెడ్డి

చిలగడ దుంప.. సిరులు పండగ

వింజమూరు: మండల కేంద్రమైన వింజమూరులోని నడిమూరులో విత్తనం కొని దుంప తీగ సాగు చేసి లాభాలు పొందుతున్నారు యువ రైతు బువ్వన లక్ష్మిరెడ్డి. జూన్ నెలలో 1.5 ఎకరాల్లో విత్తనం తీగ కోసం దీన్ని వేశారు. నాటిన 60 రోజుల్లో పెరిగింది. పొరుగున ఉన్న కడప పరిసర గ్రామాల రైతులతో పాటు పొదలకూరు ప్రాంతం వారు కూడా వచ్చి కొనుగోలు చేశారు. మాగాణి నెలలో పెంచిన తీగను విత్తనంగా వేసుకుంటే ఎకరాకి 150 నుంచి 160 బస్తాల (బస్తా 50 కేజీలు) వరకు దిగుబడి (చిలగడ దుంపలు) వస్తుందని రైతులు తీసుకెళుతున్నారు. 15 సెంట్లలో పెరిగిన తీగ రూ. 8 వేల నుంచి 10 వేల వరకు అమ్ముతారు. డిమాండ్ ఎక్కువగా ఉంటే ధర పెరుగుతుంది. తొలి కోతపై రూ. 50 వేల వరకు రాబడి వచ్చింది. మరో రెండు సార్లు కోతలు వస్తాయి. రూ. 20 వేలు ఖర్చవుతాయి. మూడు కోతలపై రూ. 1.20 లక్షల చేతికి నగదు వస్తే రూ. 20 వేల ఖర్చు పోను రూ. లక్ష నికరాదాయంగా మిగులుతుంది. ఆరునెల్లలో రూ. లక్ష రూపాయల ఆదాయం వచ్చింది.

సమస్య - సమాధానం

రైతేరాజు

సమస్య: నీరు ఉన్న ఎర్రనేలలో మినుము, జొన్న, కొర్ర, మొక్కజొన్నలో ఏది వేయవచ్చు? -అంకిరెడ్డి భాస్కర్‌రెడ్డి, విజ్జంపల్లి

సమాధానం: తేలికపాటి నేలల్లో జొన్న సాగు ఉత్తమం. ఎన్‌టీజే-5 రకం వేసుకోవచ్చు.

సమస్య: వరిలో కాండం తొలిచు పురుగు ఎక్కువగా ఉంది. నివారణకు ఏం వాడాలి? - దుంకా శ్రీహరి, చెముడుగుంట

సమాధానం: పిలక దశలో క్లోరిపైరిఫాస్, ఎసిఫేట్, కార్బోఫ్యూరాన్ గుళికలు, క్లోరాంట్రనిలిప్రోల్ గుళికలు ఎకరాకు 8 కిలోలు, క్లోరాంట్రనిలిప్రోల్ గుళికలైతే 10 కిలోలు, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలైతే 20 కిలోలు వాడాలి.

సమస్య: వరి వెన్ను దశలో దోమ కనిపిస్తోంది. ఏ జాగ్రత్తలు తీసుకోవాలి? -మనోజ్‌కుమార్, మన్నూరుపోడు

సమాధానం: పొలాన్ని ఆరబెట్టాలి. ఇమిడాక్లోప్రిడ్ ఎసిటామిప్రిడ్ 0.25గ్రాములు లేదా పైమెట్రోజిన్ 0.6గ్రాములు లేదా ఫ్లోనికామైడ్ 0.4గ్రాములు లేదా డైనోటెఫ్యూరాన్ 20 0.4గ్రాములు లేదా 0.48 మి.లీ ట్రైఫ్లుమిజోఫైరిమ్ మందును పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

(రైతుల సందేహాలకు నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.లోకేష్‌బాబు సమాధానాలు ఇచ్చారు.) - న్యూస్‌టుడే, సీతారామపురం

సంపెంగ.. ఘుమఘుమ

నారాయణమ్మ

సీతారామపురం, న్యూస్‌టుడే: ఆ రైతు దంపతులు సంప్రదాయ పంటలు సాగు చేస్తున్నారు. ఎంతకష్టపడినా గిట్టుబాటు కావడం లేదు. అప్పులే మిగులుతున్నాయి. దీంతో పూలసాగు చేపట్టి వారిని ఆరా తీశారు. వీటితో లాభాలు పొందవచ్చని తెలుసుకున్నారు. వారికున్న పొలంలో సంపెంగ సాగు చేసి లాభాలు సాధిస్తున్నారు ఉదయగిరి మండలంలోని బోడబండ గ్రామానికి చెందిన దంపతులు పోకల జయరాములు, నారాయణమ్మ. గత ఏడాది వారికున్న పొలంలో 50 సెంట్లలో సంపెంగ మొక్కలు నాటారు. మరో 30 సెంట్లలో పశుగ్రాసం వేశారు. సాగుకు రూ.25 వేల వరకు ఖర్చు చేశారు. పూల దిగుబడి బాగా

రావడంతో మొదటి రెండు నెలల్లోనే పెట్టుబడి పోను అంతే మొత్తంలో ఆదాయం వచ్చింది. అనంతరం ప్రతిరోజు 10 నుంచి 15 కిలోల వస్తున్నాయని తెలిపారు. కిలో రూ.50 చొప్పున విక్రయిస్తుంటే.. రోజుకు రూ.500 నుంచి రూ.700 చేతికి డబ్బులు వస్తున్నాయి. నిత్యం పొలంలో ఉండి రైతు దంపతులు ఇద్దరూ పనులు చేసుకుంటూ సాగు ఖర్చులు తగ్గించుకుంటున్నారు.

ధాన్యం.. నిల్వ చేస్తే..

అల్లూరు, న్యూస్‌టుడే

సాధారణంగా రైతులు కోత కోసిన వెంటనే ధాన్యాన్ని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీంతో గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అదేగనుక నిల్వచేస్తే లాభాలు వచ్చే అవకాశం ఉంది. ఇలాగే భద్రపరిచి అధిక ధరలు పొందుతున్నారు అల్లూరుకు చెందిన రామచంద్రయ్య. ఏటా 100 పుట్ల వరకు నిల్వ చేస్తున్నారు. ఈసంవత్సరంఊహించని స్థాయిలో ధరలు రావడంతో పుట్టికి రూ.12 వేల వరకు అదనంగా లాభం వచ్చింది. వంద పుట్లపై రూ.12 లక్షల వరకు రాబడి సమకూరింది.

జాగ్రత్తలు పాటిస్తేనే..

నిల్వ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి కళారాణి తెలిపారు. తేమ శాతం ఎక్కువ, తక్కువ లేకుండా చూసుకోవాలి. సిద్ధంగా ఉంచిన గోదాములోకి కీటకాలు రాకుండా ముందుగా మలాథియాన్ మందు పిచికారీ చేసి రెండు రోజులు తలుపులు తీసి ఉంచాలి. ఖాళీ బస్తాలకు ఈ మందు పిచికారీ చేయాలి. ధాన్యం నింపిన బస్తాలకు ప్రతి వరుసకు అతి తక్కువ మోతాదులో మరోసారి మందు కొట్టాలి. దీంతో పురుగులు ఆశించవు. మూడు నెలలకు ఒకసారి పిచికారీ చేయాల్సి ఉంది. ధర పెరిగాక అమ్ముకోవచ్చని ఆమె వివరించారు.

మాట్లాడుతున్న ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ రేఖారాణి

అర్హులందరికీ ఓటు హక్కు

గూడూరు పట్టణం: అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తామని, జిల్లాలో సర్ ప్రక్రియలో భాగంగా 95శాతం ఓటర్ల జాబితా పరిశీలన పూర్తయిందని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ రేఖారాణి తెలిపారు. సోమవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో అరుణకుమారితో కలిసి గూడూరు నియోజకవర్గంలోని ఓటర్ల నమోదుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్ ప్రక్రియ విజయవంతంగా ముగిసిందన్నారు. ఇంకా ఓటర్ల జాబితాలో నమోదుకాని వారు, మార్పులు, చేర్పులు అవసరమైన వారు రెండో విడతలో భాగంగా అక్టోబరులో నిర్వహించే ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులు ఓటుహక్కు కోల్పోకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో డీడీవో వాణి, కమిషనర్ మల్లికార్జున్‌రావు, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

అర్జీలను బాధ్యతగా పరిష్కరించాలి: కలెక్టర్

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్వో విజయకుమార్, డీసీవో గురప్ప, డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా పీడీలు నాగరాజకుమారి, కిరణ్‌కుమార్, శ్రీనివాస్ ప్రసాద్, సర్వే, ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగశేఖర్‌తో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

పరిశ్రమలకు సకాలంలో అనుమతులు

నెల్లూరు(కలెక్టరేట్): జిల్లాలో పారిశ్రామికవేత్తలకు అనుమతులు, రాయితీలను సకాలంలో అందించాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబరు నుంచి అబెక్స్ ద్వారా జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక, ఎగుమతుల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్‌బాబు జిల్లాలో పరిశ్రమలకు సంబంధించిన వివరాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షుశుక్లా మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 386 దరఖాస్తులు అందగా, వాటిలో 365కు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. మిగిలినవి వివిధ శాఖల పరిశీలనలో ఉన్నాయని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవోలు, ఏపీఐఐసీ జడ్‌ఎం, ఎల్‌డీఎం, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

నెల్లూరు(కలెక్టరేట్): జిల్లా వ్యాప్తంగా పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం 6.30 నుంచి పంపిణీ యాప్ అందుబాటులో ఉంటుంది. జిల్లాలో 2,87,970 మందికి రూ.126,14,96,000 నగదు అందించనున్నారు. 13,265 క్లస్టర్లలో 6,593 మంది సిబ్బంది సచివాలయాల వారీగా పింఛనుదారుల ఇళ్లకే వెళ్లి ఇవ్వనున్నారని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని జిల్లా జేఏసీ ఛైర్మన్ బండారుపల్లి వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం నెల్లూరులోని ఎన్జీవో హోమ్‌లో జేఏసీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో నాయకులు అల్లంపాటి సురేంద్రరెడ్డి, చలపతిశర్మ, మురళీకృష్ణారెడ్డి, సుదర్శన్, దశరథరామయ్య, గురవయ్య, రాజశేఖర్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

12న జాతీయ లోక్ అదాలత్

నెల్లూరు(లీగల్, నవాబుపేట), న్యూస్‌టుడే: జాతీయ లోక్ అదాలత్ ఈనెల 12న జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.నరసింహమూర్తి ప్రకటించారు. నగరంలోని జిల్లా కోర్టు హాలులో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నెల్లూరు నగరం, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, కోట కోర్టుల పరిధిలో జాతీయ లోక్‌అదాలత్ జరుగుతుందన్నారు. ఇందులో కేసులు రాజీ చేసుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతుందని అన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి వైజె.పద్మశ్రీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నరసింహమూర్తి

హరిప్రసాద్ సేవలు ప్రశంసనీయం

నెల్లూరు (లీగల్, మార్కెట్ సెంటర్): జిల్లా కోర్టులో ఎగ్జామినర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన హరిప్రసాద్ సేవలు ఎనలేనవని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.నరసింహమూర్తి అభినందించారు. హరిప్రసాద్ సన్మాన కార్యక్రమం సోమవారం జిల్లా కోర్టు ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా కోర్టు ముఖ్య పరిపాలనాధికారి నాగరాణి, న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నారాయణరెడ్డి, కార్యదర్శి వెంకట సునీల్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఆర్ఎంఎస్ కార్యాలయం వద్ద ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవితఖైదు, రూ.5వేలు జరిమానా విధిస్తూ గూడూరు 7వ అదనపు జిల్లా కోర్టు సోమవారం తీర్పు వెల్లడించింది. ఏపీపీ వసంత్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు తిరుపతి జిల్లా రేణిగుంట ప్రాంతానికి చెందిన జోగేంద్ర అలియాస్ జోగి, కామేష్‌లు రైళ్లల్లో బిక్షాటన చేస్తూ గూడూరులో ఉండేవారు. ఈ క్రమంలో 2023 మార్చిలో వారి మధ్య గొడవ జరిగింది. దీన్ని మనసులో పెట్టుకున్న జోగేంద్ర.. నిద్రిస్తున్న కామేష్‌ను బండరాయితో కొట్టి హత్య చేశాడు. అప్పుడు గూడూరు ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదుచేసి, నిందితుడ్ని కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదనల అనంతరం నేరం రుజువు కావడంతో జోగేంద్రకు జీవితఖైదుతోపాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ కోర్టు తుది తీర్పు వెల్లడించింది. ఈ సందర్భంగా పట్టణ సీఐ శేఖర్‌బాబు, కోర్టు లైసెన్ ఆఫీసర్ మల్లికార్జున్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యేశ్వరరావును జిల్లా ఎస్పీ అజిత ప్రత్యేకంగా అభినందించారు.

ఏఎస్‌పేటలో రౌడీమూకల హల్‌చల్

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: కొందరు యువకులు నడి వీధిలో పూటుగా మద్యం సేవించి, ప్రశ్నించిన వారిని కత్తితో బెదిరించిన సంఘటన మండలంలోని ఏఎస్‌పేటలో నగారఖానా కూడలిలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు కొందరు యువకులు నగారఖానా కూడలిలో మద్యం తాగుతుండగా గ్రామస్థులు ప్రశ్నించడంతో కత్తితో బెదిరించారు. మజహర్ అనే వ్యక్తిని కత్తితో బెదిరించి కొట్టి డబ్బులు డిమాండ్ చేశారు. కొందరు యువకులు వారితో వాగ్వాదానికి దిగడంతో పరారయ్యేందుకు ప్రయత్నించగా పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై జిలానీ తమ సిబ్బందితో 6 మందిని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారయ్యారు. ఎస్సై మాట్లాడుతూ లక్ష్మీనారాయణ, సాయి, బాలాజీ, హరీష్, కార్తీక్ అనే వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. లక్ష్మీనారాయణపై రౌడీషీట్ ఉన్నట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నామన్నారు.

In The Court of the Hon'ble Civil Judge (Senior Division) Kavali
I.P.No. 7/2024

Between
Male Venkata Subbareddy ... Petitioner
Vs
1. Kuppam Narasimha Setty and Co. AGL WL No NLR/45/JDA/FW/2012/2433, AGLR NO MFMSID 208356 and 34 others ... Respondents

NOTICE

To 31) Gaddam Venkata Rami Reddy Hindu, Aged about 50 years, Kavali Town, SPSR Nellore Dt.
34) Amarthaluru Lakshmi W/o Venkata Siva Kumar, Hindu, Aged about 45 years, R/o Usman Sahebpeta, Nellore. SPSR Nellore Dist. Cell: 99592 44454

అనువారికి ఈ నెంబరున పిటిషనరు U/s 10 of Provincial Insolvency Act ప్రకారం కోర్టులో పిటిషను దాఖలు చేసుకున్నందున, మీకునోటీసు నిమిత్తం తే. 28-09-2026దికి వాయిదా వేయబడియున్నది. సదరు వాయిదా రోజు ఉదయం గం॥ 10.30 నిలకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమునందు ఏక్సపార్టీగా తీర్మానించబడును.
వాయిదా : 28-09-2026

ఇట్లు : పిటిషనరు తరఫు న్యాయవాది
పోట్లూరు శ్రీనివాసులు, B.Sc.,BL., అడ్వకేట్, కావలి.

IN THE COURT OF THE HON'BLE III ADDL. CHIEF JUDICIAL MAGISTRATE :: VIJAYAWADA
C.C. No: 1844 of 2020

M/s. SULPHUR MILLS Ltd .,(SML) ... Complainant.
Rep.by.E.Adi Reddy., Regional Manager,
Vs
M/s. SRI SAI SUPRAJA FERTILIZERS.,
Rep.by.Its.Prop. Sri Pralallyakaveri Pradhana Rao., ... Accused..

NOTICE

As per the Orders of the Hon'ble Court dt.17.7.2026., NBW is pending against Mr.PRALAYA KAVERI PRADHANA RAO., u/s.138 of NI Act., Section.82 proceedings against you as ordered, Since you are avoiding the court/absconding/concealing yourself, the NBW Cannot be executed. You are hereby ordered to attend the court on 07.10.2026., Despite of this publication your absence on the said date will be viewed and declared as Proclaimed Offender and other proceedings will continue against you.
By order and in the name of theIII Addl. Chief Judicial Magistrate, Vijayawada.
COUNSEL FOR COMPLAINANT.
UDAYA BHASKARAM. J. ADVOCATE,
VIJAYAWADA. Mobile No.6302126060

NELLORE MUNICIPAL CORPORATION
RoC No. 165/Dy.EE-1/NMC/2026 Dated: 31.08.2026

EXPRESSION OF INTEREST

EOI is invited from eligible and experienced Skating Academies/ Sports Organisations/ Firms/ Agencies/ Individuals for providing skating coaching and training services on **revenue sharing basis.,** for a period of **1 year** for below mentioned Parks.

1. Children's Park, 17th Division
2. NTR Park, 19th Division

The EOI document shall have to be submitted on or before 3.00 PM on 07.09.2026

For further details, contact the **Sri A.Sesshagiri Rao, Executive Engineer (Ph: 98499 08261) and Sri R.Srikanth, Deputy Executive Engineer (98499 06613) Nellore Municipal Corporation, Nellore,** during working hours.

Sd/- **Commissioner,** Nellore Municipal Corporation, Nellore

ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యమ బాట

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 26వ తేదీ వరకు వివిధ రూపాల్లో ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు సోమవారం ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర శాఖ చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా కలెక్టర్ హిమాన్షుశుక్లాకు ఉద్యమ కార్యాచరణ నోటీసు అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఛైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు న్యాయబద్ధంగా రావాల్సిన, దాచుకున్న డబ్బులు చెల్లించమని కోరుతూ ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఉద్యోగి నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని, అన్ని డివిజన్, జిల్లా కార్యాలయాలను సందర్శించి కరపత్రాలను పంపిణీ చేసి ఆందోళనకు దారితీసిన కారణాలను వివరించాలన్నారు. 15 నుంచి 26వ తేదీ వరకు ఉద్యోగుల బకాయిలు, పీఆర్సీ, ఐఆర్, డీఏ తదితర వాటికి సంబంధించిన ఫొటోలు, రీల్స్, వీడియోలు వాట్సాప్ స్టేటస్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయనున్నట్లు తెలిపారు. 17న ఉద్యోగులంతా నల్లకండువాలు ధరించి మానవహారాలు చేయడం, 23న కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల సమీపంలో ధర్నా నిర్వహిస్తామన్నారు. 26న కుటుంబ సభ్యులతో సీఎం సార్ మా డబ్బులు మాకివ్వండి అనే నినాదంతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓవీ ప్రసాద్, మహిళా విభాగం ఛైర్మన్ కె.బాలకోటమ్మ, చెన్నమ్మ, పరంధామయ్య, శ్రీనివాసులు, దారా రమణయ్య, జి.సతీష్ పాల్గొన్నారు.

సమాచార ప్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ.14,870
(3శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 1,18,960
వెండి గ్రాము :	రూ.249.00

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	114
లేయర్	140
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్ స్కిన్‌లెస్	234
లేయర్ మాంసం	238

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

వెంకటాచలం, ముత్తుకూరు, మనుబోలు, న్యూస్‌టుడే: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందగా పది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటనలు సోమవారం వెంకటాచలం, మనుబోలు పరిధిలో జరిగాయి.

పది మందికి గాయాలు

పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. ముత్తుకూరు మండలం కృష్ణపట్నం గ్రామానికి చెందిన గిరిజన మత్స్యకారులు 11 మంది మనుబోలు మండలం బద్దెవోలులో చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి ఆటోలో ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో వెంకటాచలం మండలం నాయుడుపాళెం సమీపంలో కృష్ణపట్నం పోర్టు రహదారి పక్కన నిలిపి ఉన్న ఐరన్‌ఓర్ లారీని డ్రైవర్ ఉన్న ఫలంగా రహదారిపైకి మళ్లించాడు. దీంతో వెనుకనే వస్తున్న ఆటో అదుపుతప్పి లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న పోలయ్య (50) అక్కడికక్కడే మృతి చెందగా.. మిగిలిన 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా పడి..

వెంకటాచలం మండలం రామదాసుకండ్రిగ గ్రామానికి చెందిన **వాకా రమేష్** (38) ఓ ఛానల్‌లో రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. ఇంటి పనుల నిమిత్తం మరో వ్యక్తితో కలిసి ఆటోలో సిమెంట్, కమ్మెను మండల కేంద్రమైన మనుబోలు నుంచి తీసుకెళ్తున్నారు. కొమ్మలపూడి అడ్డరోడ్డు సమీపంలోకి వచ్చేసరికి ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రమేష్‌ను అంబులెన్స్‌లో నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. రమేష్ మృతిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్‌పై రాళ్లు

బిట్రగుంట, న్యూస్‌టుడే: అదిలాబాద్ నుంచి తిరుపతి వెళ్లే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌పై ఆకతాయిలు రాళ్లు విసిరినట్లు నెల్లూరు జీఆర్పీ పోలీసులకు సమాచారం అందింది. ఈ ఘటన బిట్రగుంట, అల్లూరు రోడ్డు రైల్వేస్టేషన్ల మధ్య ఆదివారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో జరిగింది. దీంతో సోమవారం జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది అల్లూరు రోడ్డు, బిట్రగుంట మధ్య తనిఖీ చేశారు. ఈ విషయమై కావలి జీఆర్పీ ఎస్సై వెంకట్రావును అడగ్గా తనిఖీలు చేస్తున్నామని.. ఘటనపై స్పష్టత లేదని వివరించారు.

EENADU Classifieds

TO LET

Rent 2500 SFT Shed at Woodcomplex Beside Pragathi Charties Nellore. Contact: 98481 70501, 90303 57758

JOBS

JAIN GOLD NELLORE
Walk-in Interview
JEWELLERY SALES EXECUTIVES (M)
3-5 yrs. exp. in Jewellery/ retail. Excellent communication & presentation skills required.
RECEPTIONIST (F)
Presentable, Confident, Good communication, Computer knowledge, multi tasking, Be the first smile.
WATER BOY
Candidates with good experience in Customer hospitality
Salary (All Category) 20k-40k + incentive + PF & ESI
Walk-in: 10.30 am to 12 Noon Daily.
Location: Jain Gold Showroom Premises, Nellore
JAIN GOLD
A Unit of Jain Silver Palace
Old ZP Office Centre, Achari Street, Nellore - 524003
Contact: 81250 00171

Doctors Group of Companies Pothyreddy Palem, Kovur, Nellore. Producation Executives-5 Nos, Qlf: B.Pharma/ M.Pharma, Experience: 0-2 Years. Cont: 94409 63096

శ్రీ సాయి వెంకటేశ్వర ఆటో ఫైనాన్స్‌లో పనిచేయుటకు అనుభవం గల ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్, లేడీ స్టాఫ్ కావలెను. అయ్యప్పగుడి సెంటర్, నెల్లూరు. ✆ 97007 08238

ప్రముఖ విద్యా సంస్థకు లేడీ టెలీకాలర్స్, కౌన్సిలర్స్ & ఫీల్డ్ అనుభవం కల్గిన PRO (M/F)లు కావలెను. ఆకర్షణీయమైన జీతం కల్పించబడును. ✆ 9032030124

కావలెను: వంట మాస్టర్లు, ఫ్లోర్ ఇన్‌ఛార్జ్ వార్డెన్లు, ఆయాలు, శ్రీ నేతాజీ పైలట్ స్కూల్కులు, నెల్లూరు. ఫోన్స్: 85005 52203, 90005 84488

PTG పెట్రోల్ బంకు మినిబైపాస్‌రోడ్డు, నెల్లూరులో పనిచేయుటకు పంపుబాయ్స్, గాలి పట్టుటకు బాయ్స్ కావలెను. 9989077477, 9059887799

★ రియల్ ఎస్టేట్స్ ఆఫీస్‌లో టార్గెట్స్ లేకుండా పనిచేయుటకు కంప్యూటర్ నాలెడ్జ్ కలిగిన స్త్రీ ఒకరు మరియు టెలికాలర్‌గా పనిచేయుటకు స్త్రీ ఒకరు అర్జెంటుగా కావలెను. సంప్రదించండి: 7207000444, 9966505777

FACULTY/ TEACHERS

నలంద CBSE స్కూల్ కావలి నందు పనిచేయుటకు ప్రీప్రైమరీ టీచర్స్-2, వార్డన్-1, కారు డ్రైవర్-1 కావలెను. జీ॥, భోజన వసతి (నాన్ లోకల్స్). 99894 33348, 91210 24992

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డ్ జెంట్స్ / లేడీస్ మరియు హౌస్ కీపింగ్ కావలెను. 12 గం॥లు డ్యూటీ, జీతం: 15000/-, వివరాలకు. ✆ 72880 04466, 72880 04477

పంటపాలెం ఏరియాలో సెక్యూరిటీ గార్డ్స్ జీ: 16,200, ASO జీ: 18,500 కావలెను. 8 గం॥ డ్యూటీ, Age: 20-48, ✆86395 08437, 99594 44086

Nellore జిల్లాలో ప్రముఖ కంపెనీలలో పనిచేయుటకు సెక్యూరిటీ సిబ్బంది కావలెను. వయసు & అర్హతను బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. 7842413399

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...
B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
వివరాలకు..
నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 600
Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కావలి

•కావలి •ఉదయగిరి •ఆత్మకూరు

పురపాలక కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికుల నిరసన

కార్మికులపై వేధింపులు తగవు

కావలి, న్యూస్‌టుడే: పురపాలక సంఘ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్, కార్యదర్శి బాబు కార్మికులపై వేధింపులు మానుకోవాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కావలి పురపాలక కార్యాలయం వద్ద నిరసన చేపట్టి పురపాలక కమిషనర్ అబ్దుల్ రషీద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాబు, క్రాంతికుమార్, పోలయ్య, దుర్గ, శీనయ్య, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి రూ.40 కోట్లతో ప్రణాళిక

అధికారులకు సూచనలు ఇస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తదితరులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గ అభివృద్ధికి రూ.40కోట్లతో ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరు బైపాస్ రహదారి నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ రూ.8.71కోట్లతో బైపాస్ రోడ్డును నాలుగులైన్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పురపాలక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపు రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. మండలంలోని వాసిలి నుంచి నాగులపాడు వరకు రూ.12కోట్లతో నాలుగులైన్ల రహదారి నిర్మాణం చేపడతామన్నారు. అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద లక్ష్మీనృసింహస్వామి ఆలయం భజన మందిరం రూ.10కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ జనార్దన్ నాయుడు, అభయాంజనేయస్వామి ఆలయ ధర్మకర్త కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, పురపాలక మాజీ వైస్‌ఛైర్మన్ వెంకటరమణమ్మ, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, కమిషనర్ గంగాప్రసాద్, భాజపా నాయకుడు కుడుముల సుధాకర్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పరిహారం ఇప్పించాలని వినతి

చేజర్ల, న్యూస్‌టుడే: భూ సేకరణలో కోల్పోయిన ఆలయ భూమి పరిహారాన్ని గుడి ఖాతాలో జమచేయాలని వావిలేరు ఎస్సీకాలనీ వాసులు సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో తహసీల్దారు మస్తానయ్యకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం కాలనీవాసులకు భూమి పట్టాలు మంజూరు చేసే సమయంలో కొంత భాగాన్ని మాతాపరమేశ్వరి ఆలయానికి కేటాయించారు. ప్రస్తుతం ఆ భూములను ప్రభుత్వం నడికుడి రైల్వే మార్గం కోసం సేకరించింది. అమ్మవారి మందిరానికి గుర్తింపులేని కారణంగా ఆ భూములు ప్రభుత్వ భూముల జాబితాలో చేరాయి. ప్రభుత్వం ఆలయానికి, మాన్యానికి గుర్తింపునిచ్చి పరిహారాన్ని గుడి ఖాతాలో జమచేయాలని స్థానికులు కోరుతున్నారు.

రీసర్వేతో భూములకు శాశ్వత గుర్తింపు

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేట మండలం దూబగుంట గ్రామంలో సోమవారం తహసీల్దారు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ ప్రభుత్వం రీసర్వేతో భూములకు శాశ్వత గుర్తింపు కల్పిస్తోందని రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్, వీఆర్వోలు, వీఆర్ఏలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కంకర పరిచి ఎనిమిదేళ్లు.. నిర్మాణానికి ఇంకెన్నేళ్లు?

న్యూస్‌టుడే, కలిగిరి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వాలు పదేపదే చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఎక్కడా ఆ పరిస్థితి కనిపించడం లేదు. మండలంలో చాలా చోట్ల రోడ్లు అధ్వానంగా మారడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధ్వానంగా కొత్తపేట రోడ్డు

రాళ్లు తేలి.. గుంతలుగా మారి!

మండలంలోని కొత్తపేట నుంచి పాతనపురానికి వెళ్లే రోడ్డు కంకర తేలి అధ్వానంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. 2017లో రోడ్డు అభివృద్ధికి సుమారు రూ.2కోట్లు నిధులు మంజూరయ్యాయి. 2018లో గుత్తేదారు కంకర పరచి పనులు ప్రారంభించారు. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్డు నిర్మాణానికి సంబంధించిన బిల్లులు నిలిపేశారు. దీంతో గుత్తేదారు కొర్రును ఆక్కయించి నాలుగేళ్ల తర్వాత కొంతమేర బిల్లులు పొందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా.. రోడ్డు పరిస్థితిలో పురోగతి లేదు. కలిగిరి, ఏఎస్‌పేట మండలాల ప్రజలకు ఇది అనుసంధాన రోడ్డు. ప్రస్తుతం రోడ్డంతా కంకర రాళ్లతో నిండడంతో ద్విచక్ర వాహనాలు జారి పలువురు బోల్తాపడిన సంఘటనలు ఉన్నాయి.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

– మవేకొరెడ్డి, ఏఈ, పీఆర్ ప్రత్యేక విభాగం

ఆయా గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు నిధులు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే, అనుమతులు రాగానే త్వరలో పనులు చేపడతాం.

ప్రభుత్వం మారినా ఫలితం శూన్యం: గత తెదేపా ప్రభుత్వ హయాంలో పెద్దపాడు నుంచి కొత్తూరుకు 4 కి.మీ పొడవునా రూ.4కోట్లతో రోడ్డు విస్తరణ, వంతెనల నిర్మాణం చేపట్టారు. కానీ 2019లో ప్రభుత్వం మారడంతో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. కూటమి ప్రభుత్వంలో రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు కాలేదు. కావలి-కలిగిరి జాతీయ రహదారి నుంచి పెద్దపాడు, కొత్తూరు గ్రామాల మీదుగా కలిగిరి-సంగం రహదారికి చేరువయ్యేందుకు ఇది చాలా దగ్గర దారి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా రోడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు నూతన డీఎస్పీగా టి.వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆత్మకూరు డీఎస్పీగా పనిచేసిన వేణుగోపాల్ ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు సబ్ డివిజన్‌లో శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీఐ గంగాధర్‌రావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పౌరహక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు

దుత్తలూరు, న్యూస్‌టుడే: సమాజంలో పౌరులకు కల్పించిన హక్కులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహసీల్దారు నాగరాజు పేర్కొన్నారు. మండలంలోని నర్రవాడ ఎస్సీ కాలనీలో సోమవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంగంలో ఆగిన వంతెన.. ప్రయాణికుల యాతన

కొండాపురం మీదుగా కందుకూరు వెళ్లే ర.భ రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా వంతెన అసంపూర్తిగా వదిలేశారు. రాత్రిళ్లు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. ఇటీవల ఓ కారు రాత్రి సమయంలో అందులోకి దూసుకుపోయింది. త్వరితగతిన పూర్తి చేయాలని మండల వాసులు, స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కొండాపురం



వంద టన్నుల భారం.. 90 చక్రాలపై పయనం

వంద టన్నులకు పైగా బరువైన బోరీ నియంత్రికను 90 చక్రాల ట్రాలీపై తరలిస్తుండటం సంగంలో నెల్లూరు-ముంబయి జాతీయరహదారిపై సోమవారం కనిపించింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ నుంచి సుమారు రెండు వేల కి.మీ దూరంలోని చెన్నైకి పవన విద్యుత్తు ఉత్పత్తికి కోసం దాన్ని తీసుకువెళుతున్నట్లు సిబ్బంది తెలిపారు. – న్యూస్‌టుడే, సంగం

పచ్చదనం అనుకుంటే పొరపాటే!

ఈ చిత్రం చూసి ఇదేదో పెరట్లో పెంచిన చెట్లు.. మొక్కలు అనుకుంటే పొరపాటు పడినట్లే. కలిగిరి పట్టణంలోని ముదురుగుంటలలో కాలువ నిండా పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో కాలువ ఆనవాళ్లు కోల్పోయింది. మురుగునీరు ముందుకు కదలక నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కలిగిరి

ఇలాగైతే ప్రమాదాలు జరగవా!

కలిగిరి మెయిన్‌రోడ్డుపై నిత్యం ఆటోలు భవన నిర్మాణ సామగ్రిని ఇలా రెండువైపులా కట్టుకుని ప్రమాదకరంగా తీసుకెళ్తున్నారు. దీంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రవాణాశాఖ అధికారులు స్పందించి ఇలాంటి వాహనాలపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, కలిగిరి

పునాదులకే పరిమితం

ఈ చిత్రంలో కనిపించేది కావలి పట్టణంలోని శాప్ గ్రౌండ్‌లో పునాదులకే పరిమితమైన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు. గత తెదేపా హయాంలో కావలిలో ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభించారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్మాణ పనులను విస్మరించడంతో పునాదులకే పరిమితమైంది. – న్యూస్‌టుడే, కావలి

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి : 80080 51666, 91548 46698

ఉదయగిరి : 80085 73944 ఆత్మకూరు: 8008573949

సమస్య: మండలంలోని హసనాపురం చెరువు నుంచి శ్రీకలను చెరువుకు నీరు తీసుకొచ్చే వరద కాలువ పూడికతో నిండి ఉన్నాయి. – శ్రీనివాసులు, శ్రీకలను

సమాధానం: పరిశీలించి పూడిక తొలగిస్తాం. – యాసిన్, ఇరిగేషన్ ఏఈ – న్యూస్‌టుడే, అనుమసముద్రంపేట

? అనంతసాగరంలోని లాల్ సాహెబ్‌పేటలో మురుగు కాలువలు వర్షాలు నిండిపోవడంతో దుర్వాసన వస్తోంది. – రసూల్, గ్రామస్థుడు

✓ సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. – రమణరావు, పంచాయతీ అభివృద్ధి అధికారి – న్యూస్‌టుడే, అనంతసాగరం

? మండల కేంద్రమైన మర్రిపాడు నుంచి ఏపిలగుంట వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. – వెంకటేష్, వాహనదారుడు

✓ ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే మరమ్మతులు చేపడతాం. – మదన్‌కుమార్, ఆర్అండ్‌బీ డీఈ – న్యూస్‌టుడే, మర్రిపాడు

? మండలంలోని కమ్మవారిపాలెంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి వ్యవసాయ మోటార్లు సక్రమంగా పనిచేయడం లేదు. అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి. – రమణయ్య, రైతు

✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. – దినేష్, ట్రాన్స్‌కో ఏఈ – న్యూస్‌టుడే, కలిగిరి

? మండలంలోని తరుణవాయి రహదారి ప్రారంభంలో తాగునీటి గొట్టాల కోసం తవ్విన గుంతలు పూడ్చకపోవడంతో రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. – శ్రీనివాసులు, గ్రామస్థుడు

✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. – ప్రవీణ, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, సంగం

? పట్టణంలోని ముసునూరులో వీధి దీపాలు వెలగకపోవడంతో ఇబ్బందిగా ఉంటోంది. – శ్రీరామ రాఘవయ్య, ఉత్తరరాజుపాలెం

✓ సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం. – సాయిరాం, డీఈ, కావలి పురపాలకం – న్యూస్‌టుడే, కావలి

ఎట్టకేలకు జాతీయరహదారిపై వెలుగులు

సీతారామపురం: సీతారామపురం-ఉదయగిరి 167బీజీ జాతీయరహదారిపై మూడు నెలల తరువాత దీపాలు వెలుగుతుండటంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జాతీయరహదారి మార్గంలో దీపాలు వెలగకపోవడంపై పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో జాతీయరహదారి అధికారులు విద్యుత్తుశాఖకు బకాయిలు చెల్లించడంతో సరఫరా పునరుద్ధరించారు. జాతీయరహదారిపై లైట్లు వెలగకపోవడంతో జాతీయ రహదారి ఏఈ సుమన్ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా దీపాలు వెలిగాయి.

ఏఎంసీ పాలకమండలి సమావేశం

ఉదయగిరి, న్యూస్‌టుడే: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం ఛైర్మన్ పాలుగుళ్ల విజయలక్ష్మి అధ్యక్షతన మొదటి పాలకమండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై డైరెక్టర్లు, అధికారులతో ఆమె చర్చించారు. అనంతరం పలు అభివృద్ధి తీర్మానాలను ప్రతిపాదించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కార్యదర్శి రాములమ్మ, ఏఎంసీ వైస్ ఛైర్మన్ తాతయ్య, డైరెక్టర్లు, భాజపా నాయకులు పాల్గొన్నారు.

దోమతెరల పంపిణీ

కొండిన్నెగిరిజన కాలనీలో దోమతెరలు అందజేస్తున్న న్యాయవాదులు

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని కొండిన్నె గిరిజనకాలనీవాసులకు ప్రముఖ న్యాయవాది జనకసాయిప్రసాద్ తన తండ్రి వెంకటరమణయ్య వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం దోమతెరలు అందజేశారు. అనంతరం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సహచర న్యాయవాదులు ఆర్.సాయికృష్ణ, బి.సాయికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

ఉదయగిరి: పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ఎంఈవో వెంకటేశ్వర్లు తరగతుల వారీగా విద్యార్థుల పఠన, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు సులభరీతిలో బోధన చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం దస్త్రాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలు ఇళ్లల్లో చోరీలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు పురపాలక పరిధిలోని బి.ముస్తాపురంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. మూడు ఇళ్లలో చోరీ చేశారు. స్థానికులు కొన్ని ఇంట్లో రూ.ముప్పై వేలకు పైగా నగదు అపహరించారు. స్థానికులు గమనించి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయడంతో పరారయ్యారు. సోమవారం గ్రామాన్ని పోలీసులు పరిశీలించారు.

స్థలం కబ్జాపై ఫిర్యాదు

ఉదయగిరి, న్యూస్‌టుడే: మండలంలోని అప్పసముద్రం గ్రామంలో ప్రభుత్వ స్థలం కబ్జా చేశారంటూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రామస్థులు తహసీల్దారు రామ్మోహన్‌రావుకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి శుద్ధిజల కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. అక్కడే టెంట్‌హౌస్, బడ్డీలు నిర్వహిస్తున్నారన్నారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన తహసీల్దారు పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

అర్జీలు ఇస్తున్నా.. పరిష్కారం కరవే!

కావలి, న్యూస్‌టుడే: కావలి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎలీషా నేతృత్వంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో వ్యక్తిగత, సామాజిక అంశాలపై పలువురు అర్జీలు అందజేశారు. త్వరితగతిన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామంటూ ఆర్డీవో వారికి హామీ ఇచ్చారు.

చిరువ్వాపొరుల్ని ఆదుకోండి – ప్రభాకర్, చిన్నివరప్రసాద్, గోవింద్

తుమ్మలపెంట కూడలిలో అభివృద్ధి పనుల పేరిట రోడ్డు మార్జిన్‌లో ఉండే దుకాణాలను తొలగించడంతో వారంతా నిరాశ్రయులవుతున్నారు. వారికి ప్రత్యామ్నాయంగా ఉపాధి అవకాశాలు కల్పించాలి.

జీవితమంతా రెవెన్యూలో పనిచేశా:

– షేక్ గౌస్‌బాషా, విశ్రాంత ఉద్యోగి, కావలి

ఈయన పేరు షేక్ గౌస్‌బాషా. కలిగిరిలోని రెవెన్యూశాఖలో సహాయకుడిగా పనిచేస్తుండగా డిప్యుటేషన్‌పై కావలి ఆర్డీవో కార్యాలయంలో కొన్ని నెలలుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం ప్రభుత్వం నుంచి రావాల్సిన వివిధ ప్రయోజనాల కోసం రోజూ కలిగిరి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఫిర్యాదులు చేస్తున్నా స్పందన లేదు

– హరనాథ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

కావలి పట్టణం తుఫానీనగర్ బ్రాహ్మణవీధిలో కొందరు మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. పురపాలక శాఖకు కూడా ఫిర్యాదు చేశారు. ఈమేరకు కొన్నాళ్లుగా పురపాలకసంఘ పట్టణ ప్రణాళికా విభాగానికి ఫిర్యాదులు చేస్తున్నా స్పందించడం లేదు.

అక్రమ రొయ్యలసాగు అడ్డుకోవాలి

– మల్లి, దళిత సంఘర్షణ సమితి, దగదర్తి

మండలంలోని ఉలవపాళ్ల రామన్నచెరువులో కొందరు వంద ఎకరాలు ఆక్రమించి రొయ్యలు, చేపలగుంతలు తోపాటు పేకాట, ఇతర వ్యాపారాలు చేస్తున్నారు. కలుషిత జలాలు చెరువులోకి వదులుతున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలి.

క్రీడలకు ప్రాధాన్యమివ్వండి: బ్రహ్మానందం, కిరణ్, శ్రీనిధి, సుభాష్

ఖేలో ఇండియా కింద మంజూరైన నిధుల వినియోగంలో క్రీడాసామగ్రి కొనుగోళ్లు, టెండర్లు, ప్రైజ్‌మనీ, తదితర అంశాలపై సమగ్ర విచారణ జరపాలి. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరి మృతి

తరుణవాయి (సంగం), న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తరుణవాయి గ్రామ రహదారి సమీపంలో నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పెరమన గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన గొల్లపాలెనికి చెందిన ఎం.వెంకటరమణయ్య(58) ద్విచక్రవాహనంలో బుచ్చిరెడ్డిపాలెనికి వెళుతుండగా గేదె అడ్డురావడంతో తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డారు. తీవ్రగాయాలు కావడంతో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య విమల మృతితో పాటు సంతానం ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆక్రమణలు అడ్డుకోవాలని వినతి

అల్లూరు: తమ భూములను కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని చింతగుంట ప్రాంతంలో పలువురు సాగు రైతులు తహసీల్దారు నవీన్‌కుమార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. విచారణ చేసి న్యాయం చేస్తామని రైతులకు తహసీల్దారు హామీ ఇచ్చారు.

పోలింగ్ కేంద్రాల జాబితాలు ప్రచురణ

దుత్తలూరు, న్యూస్‌టుడే: మండలంలోని 17 పంచాయతీలకు సంబంధించి మొత్తం 148 పోలింగ్ కేంద్రాల జాబితాను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రచురించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. **జలదంకి:** మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 172 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేస్తూ తుది జాబితాను సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శించినట్లు ఎంపీడీవో రవీంద్ర తెలిపారు. **ఉదయగిరి:** మండలంలోని 17 పంచాయతీల్లో నూతనంగా తయారుచేసిన పోలింగ్ కేంద్రాల తుది జాబితాను సోమవారం ప్రచురించినట్లు ఎంపీడీవో సుకుమార్ పేర్కొన్నారు. **దగదర్తి:** మండలంలోని 20 పంచాయతీల పరిధిలో 186 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించినట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఓటర్ల జాబితా వివరాలను ఆయా పంచాయతీలలో ప్రకటించినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కావలి, న్యూస్‌టుడే: ముందు వెళ్తున్న లారీని అధిగమించబోయి ట్యాంకర్ అదుపుతప్పి ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలైన ఘటన పట్టణ శివార్లలోని జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు పశ్చిమ బెంగాల్ నుంచి చెన్నైకి వెళ్తున్న రసాయనాల ట్యాంకర్ ముందు వెళ్తున్న లారీని అధిగమించబోయి ఢీకొట్టింది. ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ శ్రీనివాసన్(43) తీవ్రంగా గాయపడడంతో 108లో కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అదే ట్యాంకర్‌లో ఉన్న మరో డ్రైవర్ గాయాలపాలయ్యాడు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

గడ్డివామి దగ్ధం

మర్రిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని డీసీపల్లిలో రైతు చిలకా శశిరెడ్డి పశువుల కోసం వేసిన ఎండు గడ్డివామును సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యాయి. రైతు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కావలి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయపడిన పట్టణ శివారు ప్రాంత వాసి శీనయ్య(54) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈమేరకు కావలి గ్రామీణ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం రాత్రి పట్టణ శివార్లలోని ముసునూరు వద్ద జరిగిన ప్రమాదంలో బోగోలు మండలం తుమ్మలపెంటకు చెందిన శీనయ్యకు తీవ్ర గాయాలు కాగా 108 సిబ్బంది క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై ఇంద్రసేనారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

సంగం, న్యూస్‌టుడే: స్నేహితురాలి వివాహానికి హాజరైన ఓ యువతి అదృశ్యమైన సంఘటన మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై బొజ్జనాయక్ తెలిపిన వివరాల మేరకు.. వైయస్సార్ కడప జిల్లా బద్వేలు ప్రాంతానికి చెందిన ఓ యువతి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. సంగంలో ఆదివారం జరిగిన స్నేహితురాలి వివాహానికి తన తండ్రితో కలిసి హాజరైంది. కళ్యాణ మండపంలో తండ్రితో కలిసి కొంతసేపు ఉన్నారు. అనంతరం కనిపించకపోవడంతో కుమార్తెకు ఫోన్ చేయగా పనిచేయలేదు. ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ లభించకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సమాచారంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వసతి గృహాల మూత.. విద్యార్థుల వెత

న్యూస్‌టుడే, సంగం

పేద, మధ్యతరగతి విద్యార్థుల ఆశలకు ఆసరాగా నిలవాల్సిన వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. అద్దాన భవనాలు, కనీస సౌకర్యాలు లేమితో మండలంలో దాదాపుగా మూతపడడంతో విద్యార్థుల చదువులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. మండలంలో ఉండాల్సిన వసతి గృహాలు మూతపడటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వాటికి పూర్వ వైభవం కల్పించే దిశగా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం.

మూతపడిన సంగంలోని ఎస్సీ బాలికల వసతి గృహం

వసతులు కరవై...

మండలంలో రెండేళ్ల క్రితం వరకు సంగంలో ఎస్సీ బాలుర, బాలికల, బీసీ బాలికల, కొరిమెర్ల, దువ్వూరులో ఎస్సీ బాలుర, బీసీ బాలికల, అన్నారెడ్డిపాళెంలో బీసీ బాలుర వసతి గృహాలు ఉండేవి. ఒక్కొదానిలో దాదాపు వందమంది విద్యార్థులు ఉండి చదువుకునేవారు. సంగంలో బీసీ బాలుర, కొరిమెర్ల, దువ్వూరులో బీసీ బాలికల, అన్నారెడ్డిపాళెంలో బాలుర వసతి గృహాలు నడుస్తుండగా, మిగిలిన వాటికి సొంత భవనాలు ఉండేవి. సంగంలోని ఎస్సీ బాలికల వసతి గృహం నెల్లూరు-ముంబయి జాతీయ రహదారి పక్కనే ఉండటంతో చిన్నపాటి వర్షం కురిసినా ముంపునకు గురయ్యేది. భవనం మరమ్మతుల కోసం రూ.లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు అధికారులు ప్రకటించినా, తర్వాత వాటిని రేపూరుకి తరలించారు. కొరిమెర్లలోని ఎస్సీ బాలుర వసతి గృహం ఊరికి దూరంగా ఉండడం, వసతులు కరవవడంతో అధికారులు దాన్ని పర్యవేక్షణ లేక మూసివేశారు. సంగంలోని ఎస్సీ బాలుర, కొరిమెర్ల, దువ్వూరులోని బీసీ బాలికల వసతి గృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండేవి. అధికారులు వాటి యజమానులు ఖాళీ చేయాలనడంతో వాటిని నెల్లూరు, మంగా, సెల్లెం చెల్లించకపోవడంతో ప్రస్తుతం మూతపడ్డాయి.

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం: దువ్వూరులో ఎస్సీ బాలుర వసతి గృహం సొంత భవనాల్లో, అన్నారెడ్డిపాళెంలో బీసీ బాలుర వసతి గృహం అద్దెభవనంలో కొనసాగుతోంది. అన్నారెడ్డిపాళెంలో విద్యార్థులు సొంత భవన వసతి కల్పించాలని సంగం ఎంపీడీవో షాలెట్ దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

LIC 70వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు

ప్రియమైన పాలసీదారులకు, మా తోటి ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు, ఆఫీస్ సిబ్బందికి, బంధువులకు బీమా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ..

Rtn. గునుపాటి సురేష్‌రెడ్డి, ఛైర్మన్‌క్లబ్‌మెంబర్

చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్

కావలి లియాఫీ 1964 యూనియన్ ప్రెసిడెంట్

LIC of India

కావలి బ్రాంచ్, నెల్లూరు డివిజన్. Cont: 95422 29225

గూడూరు

• గూడూరు • కోవూరు • సర్వేపల్లి

కండలేరు జలాశయం పరిశీలన

ఇంజినీర్లకు సూచనలిస్తున్న కమిటీ ఛైర్మన్

రాపూరు, న్యూస్‌టుడే: కండలేరు జలాశయం హెడ్ రెగ్యులేటర్ గేట్లలో తలెత్తిన లోపాలపై సమగ్ర నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని డ్యాం సేఫ్టీ కమిటీ ఛైర్మన్ గోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కండలేరు జలాశయాన్ని కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. జలాశయం స్థితిగతులపై కండలేరు ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. పలు సూచనలు చేశారు. హెడ్ రెగ్యులేటర్ వద్దకెళ్లి చెన్నైకి తాగునీటి విడుదల చేసే గేట్లలో తలెత్తిన లోపాలను గుర్తించారు. త్వరలో మరమ్మతులు జరిగేలా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, శ్రీకాంత్‌తోపాటు నెల్లూరు ఎస్ఈ సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు, కండలేరు ఈఈ గజేంద్రరెడ్డి, డీఈ అనిల్‌బాబు, ఏఈఈ అనిల్‌కుమార్ ఉన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న సోమిరెడ్డి

చదువుతోపాటు క్రీడలు అవసరం

వెంకటాచలం, న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ అవసరమని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని అక్షర విద్యాలయ పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్ బాస్కెట్ బాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలవైపు ప్రోత్సహించాలన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆశీస్సులతో ఆయన కుమార్తె దీపా వెంకట్ నిర్వహిస్తున్న పాఠశాల బాగుందని ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కుముద తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే అభివృద్ధి సాధ్యం

కొడవలూరు, న్యూస్‌టుడే: యువత ముందుకొస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కొడవలూరు మండలంలోని మొగ్గూరెడ్డిపాళెంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో కలిసి పర్యటించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పీ4 కార్యక్రమ స్ఫూర్తి గ్రామంలో జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులను ప్రారంభించారు. రెండెకరాల్లో గ్రామంలో రూ.63.08 లక్షలతో పనులు చేయడం జరుగుతుందన్నారు. ఎండీఎఫ్ నిధులతో మరింత సహకారం అందిస్తామన్నారు.

ప్రారంభోత్సవంలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సదరం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్లాట్ బుక్ చేసుకున్న వారిలో 20 మంది పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు వారికి పరీక్షలు నిర్వహించారు. వైకల్య శాతాన్ని నిర్ధారించి నమోదు చేసినట్లు వైద్యాధికారిణి డాక్టర్ అమృత తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

శ్రద్ధలేని పనులు.. శుద్ధికి నోచుకోని వ్యర్థ జలాలు

న్యూస్‌టుడే, గూడూరు పట్టణం

గూడూరు పురపాలక సంఘం పరిధిలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ముఖ్యంగా పట్టణంలో చేపట్టిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ (ఎస్‌టీపీ) పనులు 80శాతం పూర్తి చేసినా, మిగిలిన 20శాతం పనులను పూర్తిచేయడంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

నిర్మాణంలో ఉన్న మురుగునీటి శుద్ధి ప్లాంట్

సుమారు 81 లక్షల లీటర్ల నీరు అవసరం

గూడూరు పట్టణంలో నిత్యం ప్రజా అవసరాల కోసం సుమారు 81 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందులో 15 నుంచి 20శాతం తాగునీటి అవసరాలకు పోగా మిగిలిన 80శాతానికిపైగా స్నానాల గదులు, మురుగుదొడ్లు, వంట గదులు, ఇతరత్రా మార్గాల్లో బయటకు వస్తోంది. దీంతో వ్యర్థజలాలు వాగులు, చెరువులు, వంకల్లో కలుస్తున్నాయి. రోజుకు సుమారు 6.5ఎంఎల్‌డీ మురుగు నీరు వస్తున్నట్లు అంచనా. ఈ జలాలనే కొందరు పంటలకు వినియోగిస్తున్నారు. దీంతో ప్రజా ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. దీంతో ప్రభుత్వం మురుగునీటి శుద్ధి కేంద్రం(ఎస్‌టీపీ) ఏర్పాటుకు చర్యలు తీసుకుంది.

తొమ్మిది నెలలైనా..

పట్టణ పరిధిలో వచ్చే మురుగును శుద్ధి చేసేందుకు ధూర్జటి నగర్ వద్ద సుమారు రూ.20లక్షల వ్యయంతో 0.11ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న ప్లాంటు ఏర్పాటుకు ఈ ఏడాది జనవరిలో సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు పనులు 80శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేస్తే మురుగు నీటిని శుద్ధి చేసేందుకు వీలు కలుగుతుంది. అలా శుద్ధజలాలతో మొక్కలు పెంపకానికి, పారిశ్రామిక అవసరాలకు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. కానీ తొమ్మిది నెలలు అవుతున్నా పనులు పూర్తికాకపోవడం గమనార్హం.

త్వరలో పూర్తి చేస్తాం

-మల్లికార్జునరావు, కమిషనర్, గూడూరు

గూడూరులో ప్రస్తుతానికి మిని మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌ను త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. మరో రెండు ప్లాంట్లు కూడా పురపాలక సంఘంలో ఏర్పాటు చేయాలనే ప్రణాళిక ఉంది. అందులో భాగంగా స్థలాలు చూపాలని రెవెన్యూ అధికారులకు లేఖ పంపించాం.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) గూడూరు: 85002 02046
కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980

సమస్య : పొదలకూరు మండలం కండలేరు జలాశయం నుంచి పులికల్లు గ్రామానికి వచ్చే రోడ్డు దారుణంగా దెబ్బతింది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. – వెంకటేశ్వర్లు,స్థానికుడు

సమాధానం: నిధులు మంజూరైన వెంటనే రోడ్డు నిర్మిస్తాం. – సుధాకర్, పీఆర్, ఏఈ

? ఇందుకూరుపేట మండలం నరసాపురంలో విద్యుత్తు సరఫరాలో హైవోల్టేజీ కారణంగా గృహోపకరణాలు దెబ్బతింటున్నాయి.
– మల్లికార్జున్‌రెడ్డి స్థానికుడు

✓ నియంత్రికలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. – నరసింహులు డిస్కం, ఏఈ

రాపూరు రేంజర్‌గా జ్యోతిఆనంద్

రాపూరు,న్యూస్‌టుడే: రాపూరు అటవీ రేంజ్ అధికారిగా జ్యోతిఆనంద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అడవుల్ని సంరక్షించేందుకు ప్రజల సహకారం చాలా ముఖ్యమన్నారు. ప్రత్యేకించి ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు అన్ని విధాలా అప్రమత్తంగా ఉంటామన్నారు.

మల్లె సాగుపై అవగాహన తప్పనిసరి

కోట,న్యూస్‌టుడే: మల్లెల సాగుపై రైతులకు అవగాహన అవసరమని ఉద్యానవన అధికారిణి సునీత అన్నారు. కోట మండలం కేశవరంలో ఆమె సోమవారం మల్లెతోటలను పరిశీలించారు. మల్లెలకు వచ్చే నేరేడుమొగ్గ తెగులు, త్రిప్స్ తెగులు నివారణకు సంబంధించి రైతులకు పలు సూచనలు చేశారు. తెగుళ్లను సకాలంలో నివారించడం వల్ల పూల దిగుబడి అధికంగా వచ్చే అవకాశముందన్నారు.

డీవైఎఫ్ఐ మహాసభలు జయప్రదం చేయండి

విడవలూరు, కోవూరు, న్యూస్‌టుడే: ఈ నెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి కల్యాణ మండపంలో జరిగే రాష్ట్ర 16వ మహాసభలను విజయవంతం చేయాలని కోవూరు డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష,కార్యదర్శులు సురేష్, బొప్పితాటి వెంకటేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాసంఘాలు, కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొనాలని కోరారు.

అర్హులందరికీ ఓటు హక్కు

సమావేశంలో తహసీల్దారు శివకృష్ణయ్య తదితరులు

పొదలకూరు, న్యూస్‌టుడే: సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిఅర్హులైన వారికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శివకృష్ణయ్య తెలిపారు. సోమవారం మండలంలోని పులికల్లు పంచాయతీ పరిధిలోని పులికల్లు, వెంకటాపురం, పర్వతాపురం గ్రామాల్లో పబ్లిక్ హియరింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు గ్రామాల్లో ఓటర్ల జాబితాకు సంబంధించి మార్పులు, చేర్పులు కోరుతూ 106 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని విచారించి పరిష్కరించినట్లు తెలిపారు. వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మనుబోలు: మనుబోలు మండలం మడమనూరు పంచాయతీలోని అయిదు పోలింగ్ కేంద్రాలను మార్పు చేస్తున్నట్లు ఎంపీడీవో జలజాక్షి తెలిపారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 19 పంచాయతీల్లో 180 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. మడమనూరు పంచాయతీలో 12 పోలింగ్ కేంద్రాలుగా పర్లపాడు, బీసీకాలనీ, ఎస్టీకాలనీల్లోని అయిదు పోలింగ్ కేంద్రాలను హైస్కూల్‌కి మార్చినట్లు తెలిపారు. మిగతా పంచాయతీల్లో యథావిధిగా కొనసాగనున్నట్లు వివరించారు. **కోట:** కోట మండలంలోని 21 పంచాయతీల్లో 212 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తూ తుది జాబితాను విడుదల చేసినట్లుగా ఎంపీడీవో దిలీప్‌కుమార్‌నాయక్ తెలిపారు. కార్యాలయాల వద్ద జాబితాలను ఉంచామని తెలిపారు.

భారీస్థాయిలో కృష్ణాష్టమి వేడుకల నిర్వహణ

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ఈ నెల 3వ తేదీన గూడూరులో నిర్వహించే శ్రీ కృష్ణాష్టమి వేడుకలను జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి వెంకటరమణ కోరారు. సోమవారం గూడూరు పట్టణంలోని కేశవ నిలయంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సిఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో పెద్దఎత్తున వేడుకలు నిర్వహిస్తున్నట్లు, పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రతినిధులు మల్లికార్జున్, రామ్మూర్తి, రామయ్య, మురళీనాయుడు, రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేలా చర్యలు

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని కూటమి ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికే మొదటి ప్రాధాన్యమని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆయన నివాసానికి వచ్చిన ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు తీసుకున్నారు. ఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన మురుగు

కోవూరు మండల పరిధిలోని లేగుంటపాడు గ్రామంలోని జెండా వీధి ఒకటో వార్డులో సిమెంట్ రోడ్డుపై మురుగు నిలిచిపోయింది. మురుగు కాలువల్లో పూడికతీయకపోవడంతో నీరు ప్రవహించే దారి లేక కాలువ నిండి రోడ్డుపై నిలుస్తోంది. దుర్వాసనతోపాటు దోమలవ్యాప్తి అధికంగా ఉందని స్థానికులు చెబుతున్నారు.– న్యూస్‌టుడే, కోవూరు

చెత్త తొలగించరా?

కోవూరు నిక్కుదల వారి వీధిలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసనతో స్థానికులు సతమతమవుతున్నారు. పందులు, ఇతర పశువులు తిరుగుతున్నాయి. పంచాయతీ అధికారులకు చెప్పినా తొలగించడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.
– న్యూస్‌టుడే, కోవూరు

దెబ్బతిన్న రక్షణ గోడ

మండల పరిధిలోని పల్లకొండ గ్రామ సమీపంలోని తెలుగు గంగ కాలువపై ఉన్న వంతెన రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. రెండు వైపులా చివరలు పూర్తిగా లేకపోవడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కలువాయి,

వంతెన నిర్మాణం.. ప్రతిపాదనలకే పరిమితం

కోట, న్యూస్‌టుడే

కోట మండలం పుచ్చలపల్లి సమీపంలో స్వర్ణముఖీనదిపై దైవాలదిబ్బ మీదుగా వంతెన నిర్మాణం.. రెండు దశాబ్దలుగా ప్రతిపాదనలకే పరిమితమైంది. దీంతో కోట, వాకాడు మండలాల్లోని 25 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నదిపై వంతెన నిర్మించ తలపెట్టిన ప్రదేశం ఇదే..

దగ్గరి దారి కావడంతో..

కోట నుంచి పుచ్చలపల్లికి వెళ్లాలంటే దైవాలదిబ్బ మీదుగా స్వర్ణముఖీ నది గుండా 15 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. అదే కోట నుంచి వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం మీదుగా పది కిలోమీటర్లు అదనంగా వెళ్లాల్సి ఉంటుంది. నదిలో నీరు లేకపోతే దైవాల దిబ్బ మార్గంలోనే ప్రజలు రాకపోకలు చేస్తుంటారు. తుపాన్లు, భారీ వర్షాలు వస్తే రెండు మార్గాలు మూసుకుపోతాయి. ఈ నేపథ్యంలో 20 ఏళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే బల్లిదుర్గాప్రసాద్‌రావు దైవాల దిబ్బ - పుచ్చలపల్లి సమీపంలో స్వర్ణముఖీనదిపై అడ్డంగా వంతెన నిర్మించాలని తలచి అంచనాలు తయారు చేయించి ప్రతిపాదనలు పంపించారు. కానీ నిధులు మంజూరు కాలేదు. నాలుగు సంవత్సరాలు క్రితం అప్పటి ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పరిశీలించి మళ్లీ ప్రతిపాదనలు పంపారు. అయినప్పటికీ ఫలితం లేదు.

కాలువలో గుర్తుతెలియని మృతదేహం

ముత్తుకూరు, న్యూస్‌టుడే: ముత్తుకూరు బీసీ కాలనీలోని మురుగు కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు సోమవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 45 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి ఆదివారం కాలువ పక్కన ఉన్న కల్వర్టుపై కూర్చుని మద్యం తాగుతూ.. మత్తులో కాలువలో పడి మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని మరణాంతర పరీక్షల నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతుడి వివరాల కోసం ఆరాతీస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సులో బంగారం చోరీ

మనుబోలు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ బ్యాగ్‌లోని బంగారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లిన ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. వెంకటగిరి మండలం బంగారుపేట బీసీకాలనీకి చెందిన భువనేశ్వరి పనుల నిమిత్తం నెల్లూరు వెళ్లారు. సోమవారం సాయంత్రం తిరుగు ప్రయాణంలో నెల్లూరుఆర్టీసీ బస్టాండ్‌లో వెంకటగిరి డిపో బస్సు ఎక్కారు. టికెట్ తీసుకునే క్రమంలో బ్యాగులో ఆధార్‌కార్డు తీస్తుండగా ఒకవైపు బ్యాగు కోసి ఉండటాన్ని గమనించి లోపల పరిశీలించారు. అందులో ఉన్న ఆరు గ్రాముల బంగారు బుట్టకమ్మలు చోరీకి గురైనట్లు గుర్తించారు. అప్పటికే బస్సు మనుబోలు వచ్చింది. బంగారం చోరీ జరిగిందని, గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు నెల్లూరులోని అయ్యప్పగుడి వద్ద దిగారని వారే అపహరించి ఉండొచ్చంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నెల్లూరులో ఫిర్యాదు చేయాలని అక్కడి పోలీసులు చెప్పడంతో బాధితురాలు వెనుదిరిగారు.

మట్టి తరలిస్తున్న వాహనాల స్వాధీనం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పురపాలక పరిధిలోని పోటుపాలెం సమీపంలో సోమవారం అక్రమంగా మట్టి తరలిస్తున్న జేసీబీ యంత్రం, టిప్పర్ లారీని గ్రామీణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌కి తరలించారు. మట్టి తరలిస్తున్న వ్యక్తులు పోలీసులు రావడం చూసి వాహనాలు వదిలి పరారయ్యారు. పోలీసులు విచారణ చేపట్టారు.

న్యాయం చేయాలంటూ వివాహిత నిరసన

కొడవలూరు, న్యూస్‌టుడే: తనకు న్యాయం చేయాలని వివాహిత అత్తింటి ముందు ధర్నా చేసిన సంఘటన సోమవారం కొడవలూరు మండలంలోని రైల్వేగేటు పరిధిలో జరిగింది. బాధితురాలు, బంధువుల వివరాల మేరకు.. జయకుమార్‌కు, చెంగమ్మకు పెద్దల సమక్షంలో 2023లో వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె ఉంది. ప్రస్తుతం చెంగమ్మ ఐదునెలల గర్భిణి. ఈ క్రమంలో జయకుమార్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తమను ఇంటికి రావద్దని వేదిస్తున్నారని బాధితురాలు ఆరోపించింది. తనకు న్యాయం చేయాలంటూ ధర్నా చేయడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరు కుటుంబాలతో మాట్లాడి కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

బుచ్చిరెడ్డిపాళెం: డివైడర్‌ను, ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన సంఘటన బుచ్చిరెడ్డిపాళెంలోని జొన్నవాడ సెంటర్‌లో అంబేద్కర్ బొమ్మ వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. కారుడ్రైవర్, ద్విచక్రవాహన చోదకుడికి ఘర్షణ జరగ్గా ద్విచక్రవాహనచోదకుడిపై కారులో ఉన్న వారు దాడిచేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డుకోవాలని ఆందోళన

ఆందోళన చేస్తున్న భాజపా నాయకులు

కోట, న్యూస్‌టుడే: స్వర్ణముఖీ, చల్లకాలువ పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణను అరికట్టాలని డిమాండ్ చేస్తూ కోట తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం భాజపా నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేశారు. ఆ మేరకు ఉపతహసీల్దారు మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాజపా నాయకులు మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకాలు వల్ల స్వర్ణముఖీ, చల్లకాలువ గుంతలమయమై భూగర్భజలాలు అడుగంటిపోయాయన్నారు. సాగు, తాగునీటికి మండల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు హరిబాబు, నాయకులు కోటారెడ్డి, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

చిల్లకూరు, న్యూస్‌టుడే: మండలంలోని ముత్యాలపాడు చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఏపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మూడు గ్రామాల రైతులకు, వెయ్యి ఎకరాల మాగాణి భూములకు సాగునీటి వనరుగా ఉన్న చెరువు పరివాహక ప్రాంతంలో కొందరు రియల్టర్లు ప్రైవేటు లేఅవుట్‌లు ఏర్పాటు చేస్తున్నారన్నారు.

8న మెగా రక్తదానశిబిరం

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: సెప్టెంబరు 8న మెగా బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీలో రక్తదానశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారిణి ప్రత్యూష తెలిపారు. ఆమె మాట్లాడుతూ కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాల సహకారంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని రక్తం కొరత లేకుండా చూసేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

కోట: కోట పంచాయతీ శ్రీలక్ష్మమ్మగిరిజనకాలనీలో సోమవారం ఎంవీరావ్ ఫౌండేషన్ ఛైర్మన్ లీలామోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు శిబిరంలో హాజరైన వారిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి అల్లంబాబు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పనితోనే సమాజంలో గుర్తింపు

విడవలూరు, న్యూస్‌టుడే: పనితోనే గుర్తింపు వస్తుందని కావలి డీడీవో నగేష్‌కుమారి అన్నారు. విడవలూరులోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పంచాయతీరాజ్ ఏఈ శ్యాంసుందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఈ చేసిన సేవలు కొనియాడారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు తొలగదు..ఇబ్బందులు తప్పవు

విడవలూరు, న్యూస్‌టుడే: విడవలూరు పార్లపల్లిలోని అలఘునాథ స్వామి ఆలయం వద్ద మలుపు వద్ద మురుగు కాలువ పగిలిపోయింది. నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. గత వారం రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ఆటోస్టాండు స్థలం ఆక్రమించారంటూ ధర్నా

తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

పొదలకూరు, న్యూస్‌టుడే: గత కొన్నేళ్లుగా ఆటోస్టాండు నిర్వహిస్తున్న స్థలాన్ని ఆక్రమించి దుకాణాలు కడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం పొదలకూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆటో కార్మికులు ధర్నా చేశారు. సదరు వ్యక్తి వాహనాల రాకపోకలకు అడ్డంగా మెట్లు కట్టి ఆక్రమించడమే కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు చేశారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహసీల్దారు శివకృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి శ్రీనివాసులు, ఆటో సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం

అధ్వానంగా మరుగుదొడ్డి

పొదలకూరు పట్టణంలోని పుట్టాయి గుంట ప్రాథమిక పాఠశాలలో 33 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరి కోసం గత వైకాపా ప్రభుత్వం నాడు-నేడు రెండో విడతలో భాగంగా పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు సుమారు రూ.మూడు లక్షలు కేటాయించింది. దాంతో మరుగు దొడ్లు, మంచినీటి సదుపాయం కల్పించేందుకు గదిని నిర్మించారు. దీనికి అవసరమైన అన్నీ హంగులను సమకూర్చారు. అనంతరం దాదాపు పనులు పూర్తి చేశారు. చివరి దశకు వచ్చే సమయానికి తలుపులు పెట్టేందుకు డబ్బు లేదని నిలిపేశారు. దీంతో చుట్టుపక్కల వారు పశువులను కట్టేయడం, మరుగుదొడ్లను నీరు లేకుండా ఉపయోగించడంతో దుర్వాసన వెదజల్లుతుంది. ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులు ఒక పాత మరుగు దొడ్డినే ఉపయోగిస్తున్నట్లు చెబుతున్నారు.
– న్యూస్‌టుడే, పొదలకూరు

తల్లి, చెల్లిని గెంటేసిన చరిత్ర జగన్‌ది: బీద

నెల్లూరు(నగరపాలకసంస్థ): జగన్ మొదలుకుని అనిల్‌కుమార్ వరకు వీపీఆర్‌ని లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతున్నారని తెదేపా జిల్లా అధ్యక్షుడు,ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఆరోపించారు. సోమవారం నెల్లూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారుగతంలో మన ప్రాంతంలో దొరికే ముడి సరకుతో మైనింగ్ ఇండస్ట్రీ పెట్టాలని వీపీఆర్ ఆలోచన చేశారని, కానీ ఆ ప్రయత్నాన్ని విరమించుకుంటున్నానని, మైనింగ్ పరిశ్రమతో తనకు సంబంధం లేదని తేల్చి చెప్పారన్నారు. ఎన్టీఆర్ తెలుగుదేశం.. చంద్రబాబు తెలుగుదేశం అంటూ నోరు జారిన అనిల్ వైకాపా చరిత్ర తెలుసుకోవాలన్నారు. పార్టీ గౌరవాధ్యక్షురాలు విజయమ్మను, చెల్లి షర్మిలను జగన్ అవమానకరంగా గెంటేయలేదా అని ప్రశ్నించారు. బీసీలను ప్రోత్సహించిన పార్టీ తెదేపా అని అన్నారు.

ఆలోచన ఘనం.. ఆచరణ శూన్యం

ఇటీవల జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా 'పల్లెవీక్షణ' కార్యక్రమంలో భాగంగా జులై 16 వ తేదీ పొదలకూరు మండలం పులికల్లు గ్రామానికి విచ్చేశారు. ముందస్తు సమచారంతో మండల, గ్రామస్థాయి అధికారులు చకచకా పశువుల తొట్టెల్లో నీటిని నింపారు. ఆ తర్వాత వాటి నిర్వహణను వదిలేశారు. ప్రభుత్వం సదాశయంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించినా అధికారుల నిర్లక్ష్యంతో అవి నిరుపయోగంగా మారాయి.

లింగంపల్లి తోపు ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన నీటితొట్టె

పల్లెపండుగలో భాగంగా పశువుల తొట్టెల వివరాలు ఇలా..

మండలం	లక్ష్యం	నిర్మించినవి	నిధులు (రూ.లక్షల్లో)
పొదలకూరు	18	8	2.43
వెంకటాచలం	32	32	9.98
ముత్తుకూరు	30	5	2.0
మనుబోలు	15	13	3.42
టీపీగూడూరు	1	1	40 వేలు

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. చెరువులు, కాలువలు ఎండిపోతున్నాయి. పశువులకు తినేందుకు గడ్డి దొరుకుతున్నా తాగేందుకు సరిపడా నీరు లభించడం లేదు. దీంతో పశుపోషకులు వాటి దాహార్తిని తీర్చలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇదీ పరిస్థితి

వేసవి దృష్టిలో పెట్టుకుని మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు గత తెదేపా ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ఆయా గ్రామాల్లో పశువుల తొట్టెలను నిర్మించింది. నీటి తొట్టెల నిర్వాహణను ఆయా పంచాయతీలకు అప్పగించింది. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అధ్వాన స్థితికి చేరాయి. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వంలో అదే దుస్థితి వచ్చింది. కూటమి అధికారంలోకి వచ్చాక పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సర్వేపల్లి నియోజకవర్గంలో రూ.18 లక్షల వ్యయంతో 59 నీటి తొట్టెలను నిర్మించారు. కానీ వాటిలో నీరు పట్టే వారే లేకపోవడంతో పశువుల దాహార్తి తీరడం లేదు.

● ఈ విషయమై ఏపీడీ గాయత్రీ దేవి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా మొత్తం 59 నీటి తొట్టెలను నిర్మించామని వాటిలో నీటిని నింపే బాధ్యతను పంచాయతీలకు అప్పగించామన్నారు. పంచాయతీ కార్యదర్శి యశ్వంత్ సింగ్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

LIC LIC వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు

ప్రతి ఒక్కరికీ ఒక పాలసీ, ప్రతి ఇంటికీ ఒక పాలసీ,
జీవిత బీమా చేయండి - ధీమాగా ఉండండి.
మా పాలసీదారులకు, ఏజెంట్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
LIC వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు.

కె.అనిత | క్లబ్ గెలాక్సి మెంబర్ గూడూరు.

9వ వర్ధంతి



ఆప్యాయత, అనురాగాలను పంచిన అమృతమూర్తి, మా అన్నగారు శ్రీకంటి నాగరాజారావు గారు వైకుంఠానికి చేరి 9 సంవత్సరాలు గడిచినా మీ జ్ఞాపకాలు మా మదిలో చిరస్మరణీయంగా నిలిచే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..

స్వర్గీయ శ్రీకంటి నాగరాజారావు గారు
ఆడిటర్, గూడూరు

తమ్ముడు: శ్రీకంటి రామమోహన్‌రావు- రాజ్యలక్ష్మి
భార్య: మాలతి
కుమారుడు: ఎస్.వి. మనోజ్‌కుమార్ - ఉజ్వల
కుమార్తె: ఎస్.వి. మహేశ్వరి - మల్లిఖార్జునరావు
S.V.రత్నం & కంపెనీ, గూడూరు మరియు బంధుమిత్రులు

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

అంకితభావంతో పని చేసిన రాఘవేంద్రం

సభలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(కలెక్టరేట్, విద్యుత్), న్యూస్‌టుడే: అంకితభావంతో పని చేసిన మంచి అధికారి రాఘవేంద్రం అని కలెక్టర్ హిమాన్షు శుక్లా కొనియాడారు. విద్యుత్తు శాఖ ఎస్ఈ కె.రాఘవేంద్రం పదవీ విరమణ చేయగా.. సోమవారం కలెక్టరేట్‌లో సత్కరించారు. కార్యక్రమంలో విద్యుత్తు శాఖకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. నగరంలోని ఓ కల్యాణమండపంలో రాఘవేంద్రానికి ఉద్యోగ విరమణ సభ ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ హిమాన్షుశుక్లా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్ఈ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో తిరుపతి ఎస్ఈ చంద్రశేఖర్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీధర్, భానునాయక్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

నెల్లూరు (విద్య): నగరంలో మంగళవారం నుంచి మూడురోజులు జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న కోరారు. సోమవారం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు వీఆర్ హైస్కూల్ నుంచి నర్తకి సెంటర్ వరకు ప్రదర్శన జరుగుతుందన్నారు. అనంతరం బహిరంగ సభ చేపట్టనున్నామని తెలిపారు. 23 తేదీల్లో డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ప్రతినిధుల సభ నిర్వహిస్తామన్నారు. కూటమి ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు అమలుచేయడం లేదన్నారు. సంఘం అధ్యక్షుడు బీపీ నరసింహ, కార్యదర్శి ఎంవీ రమణ, గ్రామీణకార్యదర్శి చైతన్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేంద్ర, నగర ఉపాధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.

శేష జీవితం హాయిగా గడపండి

విశ్రాంత ఉద్యోగులతో ఎస్పీ అజిత

నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ అనంతరం సుఖ సంతోషాలతో గడపాలని ఎస్పీ అజిత వేజెండ్ల కోరారు. ఉద్యోగ విరమణ పొందిన దర్గామిట్ట పోలీస్ స్టేషన్ ఏఎస్సై వై.మణి, డీఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పి.సుబ్రహ్మణ్యం, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ షేక్ షబ్బీర్, మహిళా హోంగార్డు వి.శివకుమారిని తన కార్యాలయంలో ఎస్పీ సన్మానించారు. కార్యక్రమంలో ఏఆర్ జిల్లా ఏఎస్పీ ఎ.అప్పారావు, ఏఆర్ ఆర్ఐ హరిబాబు, అధికారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేద.. జీవన యాతన

తండ్రి, అమ్మమ్మతో నాగమణి

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: తల్లిదండ్రులు నిరక్షరాస్యులు.. చెత్తలో వచ్చే వస్తువులను ఏరుకుని విక్రయించగా వచ్చే నగదుతో జీవనం సాగిస్తున్నారు. తమ ఇద్దరు బిడ్డలను పోషించుకుంటుండగా.. ఓ స్వచ్ఛంద సంస్థ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తోంది. నాలుగో తరగతి చదువుతున్న బాలికకు పోలియో సోకడంతో రెండు చేతులు వంగిపోయాయి. తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. నగర శివారులోని దొంతాలి డంపింగ్ యార్డులో రాచగిరి శీనయ్య కుటుంబం నివాసం ఉంటోంది. భార్యాభర్తలు డంపింగ్ యార్డులో ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలు ఏరుకుని విక్రయించి జీవనం సాగిస్తున్నారు. అక్కడే చిన్న పాక వేసుకుని నివాసం ఉంటున్నారు. భార్యకు అనారోగ్యం సోకడంతో మృతి చెందింది. అతని కుమార్తె రాచగిరి నాగమణి నాలుగో తరగతి చదువుతోంది. ఆధార్ కార్డు కూడా లేకపోవడంతో ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వారికి ఇప్పించారు. పోలియో సోకగా నాగమణికి రెండు చేతులు వంకరపోయాయి. పింఛను అందించి ఆదుకోవాలని, ఆ డబ్బుతో వైద్యం చేయించుకుంటానని, తండ్రి, అమ్మమ్మతో కలిసి అధికారులకు విన్నవించుకుంది. రెండేళ్లుగా తిరుగుతున్నా అధికారులు ఈమె వినతులను ఆలకించడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ఆదుకోవాలని ఆమె కోరుతోంది.

కాళ్లరుగుతున్నాయ్.. కనికరించండి

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాలు, మండల కేంద్రాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రజల తమ సమస్యలను స్థానికంగా పరిష్కరించుకునేలా చర్యలు తీసుకున్నా.. ఫలితం ఉండటం లేదు. దీంతో వ్యయప్రయాసల కోర్చి నెల్లూరులోని కలెక్టరేట్‌కు తరలి వస్తున్నారు. ఉన్నతాధికారులకు అర్జీలు ఇచ్చివేడుకుంటున్నారు.

శ్మశాన స్థలం ఆక్రమిస్తున్నారని..

తోటపల్లిగూడూరు మండలం కొత్తపాలెంలో గిరిజన శ్మశాన వాటిక స్థలం ఆక్రమిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. శ్మశానంలో 75 సెంట్లు ఓ వ్యక్తి కబ్జా చేశారని.. అధికారులు స్పందించి న్యాయం చేయాలని గిరిజనులు నాగరాజు, వెంకటస్వామి, చిన్నమ్మ, శేషమ్మ, చెంచమ్మ, సుబ్బరామయ్య, రమణమ్మ తదితరులు వాపోయారు.

చెరువుల్లో చేప పిల్లలు వదలాలి

జిల్లాలో 171 మత్యకార సొసైటీల్లో గిరిజన యానాదులు ఎక్కువ మంది ఉన్నారని, క్రమం తప్పకుండా మత్స్య శాఖకు లీజు చెల్లిస్తున్నా.. అధికారులు చేప పిల్లలను వదలడం లేదని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, మురళి, చెంబేటి ఉష, ప్రసాద్, శీనయ్య తెలిపారు. ఉపాధి లేక మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారని, చెరువుల్లో చేప పిల్లలను వదిలి ఆదుకోవాలని కోరారు.

కాలుష్యంతో నిమ్మ చెట్లు నాశనం

అనంతసాగరం మండలం ఆమనిచిరువెళ్లలో పేద, మధ్య తరగతి రైతులు నిమ్మ చెట్లను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. గ్రామానికి సమీపంలో కేతిగుంట వద్ద రాళ్లను పగల గొట్టి కంకర చేసే క్రషర్ ఉందని, దాని వల్ల వచ్చే దుమ్ము, బూడిద నేరుగా నిమ్మ చెట్లపై పడుతుందని పుల్లయ్య, అన్వర్‌బాషా తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 300 ఎకరాల్లో నిమ్మ చెట్లు ఎండిపోయాయని వాపోయారు.

నా భూమి కబ్జాకు యత్నం



మనుబోలు మండలంలోని అక్కంపేటకు చెందిన షేక్ అమీర్‌బాషా చేజర్ల మండలంలోని వావిలేరులో సర్వే నంబరు 188/6లో 62 సెంట్లు 2011లో కుమార్తె షేక్ అజీజున్నీసా పేరుతో కొనుగోలు చేశారు. అప్పటి నుంచి జామాయిల్ వేసుకుంటున్నారు. రోడ్డు ప్రమాదంలో కుమార్తె అజీజున్నీసా మృతి చెందింది. ఆ భూమిని భార్య షంషాద్ పేరుతో మార్చారు. దీని పక్కనే భూమిని కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్న కొందరు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: నగరంలోని నాగేంద్రనగర్‌లో పుట్ట ఆర్చి వద్ద పీడీ6/ఏ6 స్తంభానికి విద్యుద్దీపం వెలగడం లేదు. రాత్రయితే చీకటిగా ఉంటుంది. - ప్రసాద్, స్థానికుడు

సమాధానం: వెంటనే దీపాన్ని ఏర్పాటు చేస్తాం. - ముజాహిద్దీన్, డీఈ

? నగరంలోని చంద్రమౌళినగర్‌లో నెలల తరబడి కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. భరించలేకున్నాం.- సుజాత, స్థానికురాలు

✓ వెంటనే సిబ్బందితో కాలువలను శుభ్రం చేయిస్తాం. - డాక్టర్ దినేష్, ఆరోగ్యాధికారి

- న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

ఇసుక తవ్వకాలను అడ్డుకోవాలి

నెల్లూరు(ఇరిగేషన్): ఇసుక అక్రమ తవ్వకాలను నియంత్రించాలని నగరంలోని రామలింగాపురం నీటిపారుదల శాఖ ప్రధాన కార్యాలయం వద్ద భాజపా నాయకులు సోమవారం ధర్నా చేశారు. నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని భాజపా నాయకుడు మిడతల రమేష్ మండిపడ్డారు. కార్యక్రమంలో భాజపా నాయకులు రాజేశ్వరి, శ్రీనివాసులు, సునీల్ రెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'నూరు శరత్తులు' పుస్తకావిష్కరణ

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆరుద్ర సాహిత్య సేవా స్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత డాక్టర్ పురుషోత్తం 'నూరు శరత్తులు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ డి.గిరి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యా పరిష్కరిస్తాం: ఎస్పీ

నెల్లూరు (నేర విభాగం) : జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఎస్పీ అజిత వేజెండ్ల అన్నారు. సోమవారం పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యాప్తంగా 154 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో కావలి డీఎస్పీ వీవీ రమణకుమార్, మహిళా పోలీసుస్టేషన్ సీఐ సుబ్బారావు, ఎస్‌బీ సీఐ దశరథరామారావు, ఎస్‌బీ 2 సీఐ వెంకట్రావు పాల్గొన్నారు. ● ఓ కంపెనీకి చెందిన కెమికల్స్, మెటీరియల్స్ సరఫరా చేస్తానని చెప్పి రూ.51.85 లక్షలు తీసుకుని సరఫరా చేయలేదని చిల్లకూరు ప్రాంతానికి చెందిన బాధితుడు ఆరోపించారు. ● సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి హైదరాబాద్‌కు చెందిన యదువీర్ రూ.15 లక్షలు తీసుకొని మోసం చేశారని కోవూరు ప్రాంత బాధితుడు ఫిర్యాదు చేశారు. ● కుమారుడు, కోడలు ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు బుచ్చిరెడ్డిపాలేనికి చెందిన వృద్ధులు వాపోయారు. ● కార్తీక్ తేజ అనే వ్యక్తి వేధిస్తున్నారని నెల్లూరు గ్రామీణ పోలీసుస్టేషన్‌కు చెందిన బాధితురాలు ఫిర్యాదు చేశారు. ● భర్త, అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తున్నటు ముత్తుకూరుకు చెందిన బాధితురాలు వినతిపత్రమిచ్చారు.

పొంగిన మురుగు.. ప్రజల అవస్థ

నగరంలోని వీఆర్‌సీ సమీపంలోని దండువారి వీధిలో రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో ఈమార్గంలో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు (విద్య)

గుంతలు.. చూడకుంటే ఆసుపత్రికే!

నగరంలోని అన్నమయ్య సర్కిల్ నుంచి కనుపర్తిపాడు వెళ్లే దారిలో కొండాయపాలెం వద్ద రోడ్డు గుంతలుగా మారడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు (పద్మావతి సెంటర్)

వెలిగొండ వేదికపై బాలికల అభినయం

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో విద్యార్థులు నిర్వహించిన గిరిజన సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. జిల్లాలోని చంద్రశేఖరపురంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయం, కావలిలోని గురుకులం, గొలగమూడి ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఇతర ప్రాంతాల విద్యార్థులతో కలిసి గిరిజన నృత్యం ప్రదర్శించారు. - నెల్లూరు (సంక్షేమం), న్యూస్‌టుడే

ఆన్‌లైన్ విధులకు ఉద్యోగులు దూరం

మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు సతీష్

నెల్లూరు (బీవీ నగర్): జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పని చేస్తున్న ఉద్యోగులు సమ్మెలో భాగంగా సోమవారం ఆన్‌లైన్ విధులకు గైర్హాజరయ్యారు. దీంతో ఓపీ, ఐపీ సేవలు ఆలస్యమయ్యాయి. మెడికల్, హెల్త్ కేర్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ జేఏసీ పిలుపు మేరకు కొద్ది రోజులుగా నిరసన తెలుపుతున్నారు. ఇందులో భాగంగానే కాంట్రాక్టు పారా మెడికల్ సిబ్బంది ప్రదర్శన చేశారు. వీరికి సీఐటీయూ నాయకులు సతీష్ మద్దతు పలికారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పలువురు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

పార్వీ సినిమాస్ (ఎం.I) షెడ్యూల్ స్క్రీన్ I. టాక్సిక్ (తెలుగు) స్క్రీన్.2. ఇరుముడి (తెలుగు) స్క్రీన్..3. విశ్వనాథ్ అండ్ సన్స్ (తెలుగు) ,టాక్సిక్ (తెలుగు) పార్వీ సినిమాస్ (స్పైస్) స్క్రీన్.I. టాక్సిక్ (తెలుగు) స్క్రీన్.2. టాక్సిక్ (తెలుగు), చిరంజీవి, (తెలుగు) స్క్రీన్ 3. విశ్వనాథ్ అండ్ సన్స్ (తెలుగు) స్క్రీన్ 4. టాక్సిక్ (తెలుగు) స్క్రీన్.5. ఇరుముడి (తెలుగు) రైన్ సినిమా షెడ్యూల్ స్క్రీన్..I ఇరుముడి (తెలుగు) స్క్రీన్ 2. టాక్సిక్ (తెలుగు) స్క్రీన్.3. టాక్సిక్ (తెలుగు) స్క్రీన్ 4. విశ్వనాథ్ అండ్ సన్స్ (తెలుగు), చిరంజీవి(తెలుగు), హాయ్ (తెలుగు)

తల్లి, చెల్లిని గెంటేసిన చరిత్ర జగన్‌ది: బీద

నెల్లూరు(నగరపాలకసంస్థ): జగన్ మొదలుకుని అనిల్‌కుమార్ వరకు వీపీఆర్‌ని లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతున్నారని తెదేపా జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఆరోపించారు. సోమవారం నెల్లూరులోని తెదేపా జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి జిల్లాలో దొరికే ముడి సరకుతో మైనింగ్ ఇండస్ట్రీ పెట్టాలని నాడు వీపీఆర్ ఆలోచన చేశారని, పలు కారణాలతో ఆప్రయత్నాన్ని విరమించుకుంటున్నానని, మైనింగ్ పరిశ్రమతో తనకు సంబంధం లేదని చెప్పారన్నారు. ఎన్టీఆర్ తెలుగుదేశం.. చంద్రబాబు తెలుగుదేశం అంటూ నోరు జారిన అనిల్ వైకాపా చరిత్ర తెలుసుకోవాలన్నారు. పార్టీ గౌరవాధ్యక్షురాలు విజయమ్మను అవమానకరంగా గెంటేయలేదా అని ప్రశ్నించారు. రాష్ట్రమంతా తిరిగిన చెల్లి షర్మిల ఎందుకు వీడారన్నారు. సమావేశంలో రాష్ట్ర ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ ఛైర్మన్ జడ్.శివప్రసాద్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు వచ్చినా, ఎక్కడ అభివృద్ధి జరిగినా తామే చేశామని ప్రచారం చేస్తున్నారని బీద రవిచంద్ర ఒక ప్రకటనలో విమర్శించారు. వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం అనగానే సోషల్ మీడియాలో కథనాలు పుట్టిస్తున్నారని, వెలుగొండ క్రెడిట్ చంద్రబాబుకు కాకుండా ఎవరికి వస్తుందని ప్రశ్నించారు. 30 ఏళ్ల కలను సీఎం చంద్రబాబు సాకారం చేశారని వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు.

జగన్ హయాంలోనే పుష్కలంగా నీరు: అనిల్

నెల్లూరు (బీవీ నగర్), న్యూస్‌టుడే: మా హయాంలోనే వెలిగొండ ప్రాజెక్టు చేశాం.. అయినా వారే చేసినట్లు చంద్రబాబు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ఎద్దేవా చేశారు. కరోనా కష్టకాలంలోనూ 10.5 కిలోమీటర్ల మేరకు 80 శాతం మేర వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పనులు జరిగాయన్నారు. సోమవారం నగరంలోని వైకాపా జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. 1996లో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు, 2004 వరకు ఒక్క తట్ట మట్టి కూడా తీయలేదన్నారు. జగన్ హయాంలో అన్ని చోట్లా నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, ఇక్కడ రెండో పంటకు నీరు లేవని, ఇస్తే సంతోషిస్తామన్నారు.

బరిలో దిగితే పతకమే

వెయిట్ లిఫ్టింగ్‌లో చైతన్య ప్రతిభ

న్యూస్‌టుడే, నెల్లూరు (బీవీ నగర్)

రంగంలోకి దిగితే ఎంత బరువైనా సరే ఎత్తుతాడు. పతకాలు సాధిస్తున్నాడు. రాష్ట్ర, జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని జిల్లా పేరును నిలబెడుతున్న చైతన్య అందరి ప్రశంసలు పొందుతున్నాడు. తాజాగా అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడు. పుదుచ్చేరిలోని సాయి అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు.

నగరంలోని ఆకుతోటలో ఉంటున్న చిరంజీవి, సుధారాణి దంపతుల కుమారుడు కె.చైతన్య ఇంటర్మీడియట్ పూర్తిచేశాడు. ఆరో తరగతి నుంచే వెయిట్ లిఫ్టింగ్‌పై ఆసక్తి పెంచుకున్నాడు. అతనిలో ఉన్న ప్రతిభతో కడప క్రీడా పాఠశాలలో ప్రవేశం దొరికింది. నైపుణ్యం సంపాదించాడు. ఏడాది క్రితం పుదుచ్చేరిలోని సాయి అకాడమీలో ప్రవేశం సాధించాడు. ఇందులో శిక్షణ పొందాలని ఎంతో మంది క్రీడాకారులు లక్ష్యంగా పెట్టుకుంటారు. అలాంటి అకాడమీలో ప్రవేశం సాధించాడు. ఇప్పటి వరకు నాలుగు జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించాడు. 2023లో న్యూదిల్లీలో జరిగిన అండర్-19 జాతీయ స్థాయి పోటీలు, గత ఏడాది యూత్ నేషనల్స్ యూపీలో జరగ్గా 8వ స్థానం వచ్చింది. హిమాచల్ ప్రదేశ్, న్యూదిల్లీలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. రైల్వేలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నాడు.

ఉద్యోగం ఇవ్వాలని మహిళ ఆందోళన

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: కారుణ్య నియామకాలు ఈనెల 31వ తేదీలోగా చేపట్టాలనే ఆదేశాలున్నా ఎస్ఈ పట్టించుకోవడం లేదంటూ తుపాకుల వెంకటరమణమ్మ అనే మహిళ ఎస్ఈ కార్యాలయం ముందు సోమవారం ఆందోళన చేశారు. అక్కడి నుంచే రాష్ట్ర అధికారులకు లేఖలు రాశారు. జేఏసీ నాయకులు శరత్, మస్తానయ్య, తదితరులు ఆమెకు మద్దతు తెలిపారు.

అధికారిణిపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : కోవూరులో అంగన్‌వాడీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు కోరారు. సోమవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు రహనాబేగం, సీఐటీయూ నాయకులు అల్లాడి గోపాల్ పాల్గొన్నారు.

కన్సల్టెన్సీ పేరుతో రూ.కోట్లలో మోసం

నెల్లూరు(వేదాయపాలెం): నెల్లూరు నగరంలో ఓ కన్సల్టెన్సీ పేరుతో ఎంబీబీఎస్ సీట్లు ఇప్పిస్తామని, దుబాయి నుంచి బంగారు కాయిన్లు తక్కువ ధరకు తెప్పిస్తామని నమ్మించి రూ.కోట్లలో మోసాలకు పాల్పడినట్లు బాధితులు ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇందులో జిల్లాలోని అనేకమంది బాధితులు ఉన్నట్లు వారు వివరించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎస్సీ జాబితాలో చేర్చాలని రజకుల నిరసన

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక ఎస్సీ సాధన కమిటీ రాష్ట్ర కన్వీనర్ అక్కినపల్లి లక్ష్మయ్య కోరారు. సోమవారం కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అర్జీలకు శాశ్వత పరిష్కారం: మేయర్

నెల్లూరు(నగరపాలకసంస్థ) : ప్రజల నుంచి అందుకున్న అర్జీలకు శాశ్వత పరిష్కారం అందిస్తామని నగర మేయర్ సుజాత తెలిపారు. సోమవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని పేర్కొన్నారు. కమిషనర్ వైవో నందన్ మాట్లాడుతూ టిడ్కో గృహాలు మంజూరైనా స్వాధీనం చేసుకోని వాటిని 602 మందికి కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల ఏసీ హిమబిందు, డీసీ చెన్నుడు, ఏసీ రేష్మ, ఎస్ఈ రహంతుజానీ, ఈఈ శేషగిరిరావు, ఆరోగ్యాధికారి దినేష్, సిటీప్లానర్ రఘునాథరావు, టీపీవో సతీష్ పాల్గొన్నారు. గాంధీ గిరిజన కాలనీ ప్రాంతంలోని సమస్యలను పరిష్కరించాలని నగర మేయర్ సుజాత అధికారులను ఆదేశించారు. తన ఛాంబరులో అధికారులతో సమావేశం నిర్వహించారు.

డంపింగ్ యార్డులో థీమ్ పార్కు: కృష్ణయ్య

అధికారులతో చర్చిస్తున్న కృష్ణయ్య

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరంలోని అల్లీపురంలో 6.6 ఎకరాల్లో ఉన్న డంపింగ్ యార్డులో థీమ్ పార్కు, మొక్కల పెంపకం లేదా ఇతర అధునాతన నిర్మాణాలు చేపట్టాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మన్ పి.కృష్ణయ్య తెలిపారు. సోమవారం నగరపాలకసంస్థ అధికారులతో కలిసి డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువ కాలం డంపింగ్ యార్డుగా ఉన్నందున మట్టి, భూగర్భ జలాలు కలుషితమయ్యే అవకాశం ఉందని, పరీక్షలు చేసి ఫలితాలను విశ్లేషించిన తర్వాతే ఇతర నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్, ఎస్ఈ రహంతుజానీ, ఈఈ చంద్రయ్య, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారావు, పబ్లిక్ హెల్త్ విభాగం ఈఈ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షలతోనే కమ్మ సాయి హత్య

ఎనిమిది మంది నిందితుల అరెస్టు

నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే: పాతకక్షలు, వ్యక్తిగత విభేదాలతోనే కమ్మ సాయి హత్య జరిగిందని నగర ఇన్‌ఛార్జి డీఎస్పీ గిరిధర్ తెలిపారు. నెల్లూరు నగరంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ హత్య కేసులో ఎనిమిది మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలను సోమవారం రాత్రి వేదాయపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌ఛార్జి డీఎస్పీ గిరిధర్ వెల్లడించారు. చంద్రమౌళినగర్‌కు చెందిన లక్ష్మీశెట్టి సాయితేజ అలియాస్ కమ్మ సాయిపై గతేడాది ఏప్రిల్‌లో వేదాయపాలెం పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించి కడప కేంద్ర కారాగారానికి తరలించారు. ఇటీవల జైలు నుంచి బయటకు వచ్చారు. అతనికి పలువురితో పాత కక్షలు ఉన్నాయి. ఆదివారం వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్‌కు హాజరయ్యాక.. కె.హనూక్, ప్రేమ్‌కుమార్, వంశీకృష్ణ అలియాస్ నిప్పో వంశీ, సాయికుమార్, రాహుల్, ప్రదీప్, హరి, జగదీష్ మరికొందరితో కలిసి అనంగుట సమీపంలో మద్యం తాగారు. ఈసమయంలో వారి మధ్య వివాదాలు చెలరేగాయి. దీంతో నిందితులు సాయిని దారుణంగా హత్య చేశారు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. అరెస్టు అయిన వారిలో వంశీకృష్ణ అలియాస్ నిప్పో వంశీ, సాయికుమార్, జగదీష్‌పై రౌడీషీట్లు ఉన్నాయన్నారు. పలువురు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. సమావేశంలో వేదాయపాలెం ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సీతారామయ్య పాల్గొన్నారు.



(c) eenadu